

epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 123 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 3 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




# పశ్చిమాసియాలో ప్రళయ ఘోష



## రగిలిపోతున్న మిడిల్ ఈస్ట్!

- ఖమేనీ మృతి ప్రతీకారంతో రగులుతున్న ఇరాన్
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణుల వర్షం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయంపై బాలిస్టిక్ క్షిపణితో దాడి చేశామన్న ఇరాన్
- ఇరాన్ లో ఇప్పటివరకు 550 మంది మృతి
- ఆస్పత్రి, బాలికల పాఠశాలపై బాంబుల మోత
- కువైట్‌లో కూలిన అమెరికా ఎఫ్-15 ఫైటర్ జెట్
- తమ క్షిపణులే కూల్చాయని ఇరాన్ ప్రకటన
- సౌదీలో అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి
- నాపై హత్యాయత్నం చేసినందుకే ఖమేనీని మట్టుబెట్టాం.. యుద్ధం మరో 4-5 వారాలు ఉంటుందన్న ట్రంప్

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన దాడులు, దానికి ప్రతికారం తీర్చుకునేందుకు ఇరాన్ చేస్తున్న ఎదు రుదాడులతో యావత్ మిడిల్ ఈస్ట్ అట్టుడుకుతోంది. యుద్ధం ప్రారంభమైన రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయ తుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ కమాండర్లు మరణిం చడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ ఇజ్రాయెల్‌తో పాటు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడుతోంది. దాడులు, ప్రతిదాడులతో మూడు రోజులుగా పశ్చిమాసియా దద్దరిల్లుతోంది.

4



### మత్తు మందు ఇచ్చి
## విద్యార్థినిపై లైంగిక దాడి

నగ్న ఫొటోలు సోషల్ మీడియాలో పెడుతానని బెదిరింపు..!

### దుబాయ్‌లో చిక్కుకున్న
## మంత్రి తుమ్మల



.. వివరాలు 2లో

# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి



### బయటపడుతున్న మోదీ దుర్మార్గ చర్యలు

- ఇరాన్ లాంటి దుస్థితి భారత్‌కు రాకూడదు
- మోడీ తీరుతో ప్రమాదంలో దేశ పరిస్థితి
- వికారాబాద్ కాంగ్రెస్ సమావేశంలో రాహుల్
- శంషాబాద్‌లో రాహుల్‌కు స్వాగతం పలికిన రేవంత్

**వికారాబాద్, మార్చి 2:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దుర్మార్గాలన్నీ బయటపడుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, రాహుల్ గాంధీ తెలిపారు. మోదీ తప్పులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ సూచించారు. అందుకు కార్యకర్తలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. వికారాబాద్‌లో పీఏసీ సభ్యులతో రాహుల్ గాంధీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రాహుల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై సమావేశంలో మాట్లాడిన రాహుల్ గాంధీ.. యుద్దానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇరాన్ లాంటి పరిస్థితులు దేశానికి రాకుండా ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వ చర్యల వల్ల ఇండియాలో యుద్ధం వచ్చే పరిస్థితులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్‌తో ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు.

మిగతా 2 లో

### రాహుల్‌ను ప్రధాని చేయడమే
## మన కర్తవ్యం

- అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
- సీఎం రేవంత్



వివరాలు 2వ పేజీలో




### గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని
## క్షేమంగా వెనక్కి తీసుకురండి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- గల్ఫ్‌లో చిక్కుకున్న వారిని క్షేమంగా రప్పించేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు
- విమానాశ్రయాలు తెరుచుకునే వరకు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచన

5

### పశ్చిమాసియా ఉద్రిక్తతలపై
## ప్రధాని ఆరా

- అరబ్ దేశాల అధినేతలతో ఫోన్‌లో సంభాషణ
- భారతీయుల భద్రతపై కీలక చర్చలు
- ఢిల్లీలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ అత్యవసర భేటీ



4



# దుబాయ్‌లో చిక్కుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**క్షేమంగానే ఉన్నట్లు సమాచారం అందచేత**

**హైదరాబాద్, మార్చి 2:** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య భీకర యుద్ధ జరుగుతోంది. పశ్చిమ ఆసియా దేశాల్లోనెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా దుబాయితో పాటు గల్ఫ్ దేశాలు తమ గగన తలాన్ని మూసేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. గత ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లారు. మంత్రి కుటుంబ సభ్యులలో ఒకరికి అకస్మాత్తుగా అనారోగ్యం కలగడంతో, మెరుగైన చికిత్స అందించడం కోసం ఆయన దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి రావాలని భావిస్తున్న సమయంలో పశ్చిమ ఆసియాలో యుద్ధం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఆయన దుబాయ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ ఎయిర్ పోర్ట్ లోని టెర్మినల్ – 3 సమీపంలో క్షిపణి దాడులు జరినట్లు సమాచారం. భద్రతా కారణాలతో అక్కడ ప్రభుత్వం విమానా రాకపోకలు నిలిపివేశాయి. దీంతో మంత్రి తుమ్మల అక్కడే చిక్కుకుపోయారు. దుబాయ్ ఎయిర్‌పోర్ట్‌పై ఇరాన్ దాడుల నేపథ్యంలో అన్ని విమానాలను అక్కడ ప్రభుత్వం రద్దు చేయడంతో మంత్రి తుమ్మల దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. అయితే, తాను సురక్షితంగా ఉన్నానని, ఎయిర్ పోర్టు క్లియరెన్స్ ఇచ్చే వరకు ఇండియా తిరిగి రాలేని పరిస్థితి అని అన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తుమ్మల తెలిపారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**తెలంగాణ వారి కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**న్యూఢిల్లీ,మార్చి2:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పౌరులకు సహాయం అందించేందుకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. మధ్యప్రాచ్యం ప్రాంతంలో ఏర్పడుతున్న పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం సమగ్రంగా పర్యవేక్షిస్తోంది. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు.. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఆయా దేశాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణ పౌరులు, వారి కుటుంబ సభ్యుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదుల దృష్ట్యా.. తెలంగాణ భవన్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం. అవసరమైన సమన్వయం, సహాయం అందించేందుకు 24x7 కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు, తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఏవైనా ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదురైతే ఈ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. మధ్యప్రాచ్యం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై వాదనలు

**విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు**




**హైదరాబాద్, మార్చి 2:** జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ రిపోర్ట్ ను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కేసీఆర్, హరీశ్ రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్ కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పుడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరఫు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు. దే సమయంలో ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కూడా పలు అంశాలను ప్రస్తావించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. కేసీఆర్, హరీశ్ రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చింది. తన విధులు నిర్వహించడం లో స్మిత సబర్వాల్ విఫలం అయ్యారని నివేదిక లో ఉంది' అని ప్రభుత్వం తరఫు లాయర్లు హైకోర్టు ధర్మాసనంకు తెలియజేశారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15 కి వాయిదా వేసింది.

# మోదీ దుర్మార్గాలపై యుద్ధం చేయాలి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో పార్టీ.. ప్రభుత్వం కలిసి మంచిగా పని చేస్తున్నాయని రాహుల్ పేర్కొన్నారు. సామాజిక అంశాలపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టాలని పార్టీ సీనియర్ నేత వీహెచ్ కోరగా.. అందుకు రాహుల్ సమ్మతి తెలిపారు. సమావేశంలో రెండు తెలుగు రాష్ట్రాల పీఏసీ సభ్యులు పాల్గొన్నారు. రాహుల్ గాంధీతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్, మహేష్ గౌడ్, వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్.. ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ నుంచి అనంతగిరి హరితా రిసార్ట్స్‌కు బయలుదేరారు. అక్కడ జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనన్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ పీఏసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ, ఏపీ పీసీసీ చీఫ్‌లు మహేశ్‌కుమార్ గౌడ్, షర్మిలతో పాటు ముఖ్యనేతలు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై నేతలతో రాహుల్ చర్చించారు. గత 9 రోజులుగా ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల శిక్షణ శిబిరం అక్కడ కొనసాగుతోంది. అంతకుముందు



ఉదయం ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇరువురూ వికారాబాద్ జిల్లాకు బయలుదేరారు. వికారాబాద్ ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి రాహుల్ గాంధీ హాజరు అయ్యారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశంలో ప్రస్తుత రాజకీయ అంశాలు, పార్టీ బలోపేతం తదితర కీలక విషయాలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులను ఖరారు చేసే అవకాశం ఉంది. రాజ్యసభ రేసులో అభిషేక్ సింఘ్వి, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి, వీహెచ్, దొమ్మటి సాంబయ్య, బెల్లయ్య నాయక్, హజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. వికారాబాద్ చేరుకున్న కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మంత్రి వివేక్ వెంకటస్వామి స్వాగతం పలికారు. హెలిప్యాడ్ దగ్గర బొకేతో స్వాగతం పలికిన మంత్రి వివేక్ రాహుల్ గాంధీని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో సంపత్ కుమార్, షబ్బీర్ అలీ, సునీతారావులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. సమావేశంలో సంస్థాగతంగా పార్టీ బలోపేతంపై రాహుల్ గాంధీ చర్చించినట్లు సమాచారం. రాహుల్ గాంధీతో పాటు కేసి వేణుగోపాల్ సమావేశంలో పాల్గొన్నారు.

# రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

- అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం సీఎం రేవంత్

**వికారాబాద్, మార్చి 2:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోదీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.



తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

# రాజ్యసభకు మరో రెండురోజులే గడువు

- వికాబాద్ సభలో రాజ్యసభ ప్రస్తావన
- సామాజిక సమీకరణాల ఆధారంగా ఎంపిక
- సంఘ్విని తమిళనాడు నుంచి పంపాలని సూచన

**వికారాబాద్, మార్చి 2:** రాజ్యసభ నామినేషన్లకు మరో రెండు రోజుల గడువే ఉంది, ఈ రెండు స్థానాలను బలం రీత్యా కాంగ్రెస్ గెలచుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు అబ్యరథులను ఖరారు చేయలేదు. వికారాబాద్ వేదికగా జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల సమావేశంలో రాజ్యసభ సభ్యుల ఎంపికపై పార్టీ అగ్రనేతలు మధ్య సోమవారం కీలక చర్చ జరిగిందని సమాచారం. సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర నేతలను పార్టీ అగ్రనేతలు సూచించారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ



చేయని బలమైన నేతలకు ఈ సీట్లు కేటాయించాలనే అంశంపై ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఎంపీల రేసులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ వీ హన్మంతరావు, బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య పేర్లను ఈ సందర్భంగా వారు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించేలా పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ రాజ్యసభ సభ్యుల ఎంపికపై జరిగిన చర్చలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ న్యాయవాది, మాజీ ఎంపీ అభిషేక్ మను సింఘ్విని తమిళనాడు నుంచి రాజ్యసభకు పంపేందుకు తెలంగాణ నేతలు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. 2026, ఫిబ్రవరి 18వ తేదీన రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం విడుదల చేసింది. 10 రాష్ట్రాల్లోని మె–ంత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఈ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆ జాబితాలో తెలంగాణ నుంచి 2 స్థానాలు ఖాళీ కానున్నాయి. బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభిషేక్ మను సింఘ్వి పదవులు ముగియనున్నాయి. వీరి పదవి కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఎంపీల ఎన్నిక అనివార్యమైంది. ఃాజ్యసభ ఎన్నికల నామినేషన్ల దాఖలు చేసే చివరి తేదీ: మార్చి 5 కావడంతో ఎంపిక త్వరగా చేయాలని ఒత్తిడి పెంచారు.

# క్యాతన్‌పల్లి కేసులో బాల్క సుమన్‌కు బెయిల్

**మంచిర్యాల, మార్చి 2:** క్యాతన్‌పల్లి కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కు బెయిల్ మంజూరయ్యింది. కోర్టు రూ. 25వేల పూచీకత్తుతో, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సోమవారం ఉదయం బాల్క సుమన్ కస్టడీ పిటిషన్‌ను వాయిదా వేసిన కోర్టు సాయంత్రం బెయిల్ మంజూరు చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీ బాల్కసుమన్‌కు బెయిల్ రాకుండా అడుగడుగునా అడ్డుపడింది. బెయిల్ పిటిషన్‌పై మంచిర్యాల కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ పోలీసులతో జిల్లా కోర్టులో అప్పీల్ చేయించింది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన జిల్లా కోర్టు ఈ నెల 5వ తేదీకి వాయిదా వేసింది. ఇక బెయిల్ పిటిషన్‌పై లంచ్ తర్వాత తీర్పును వెల్లడించింది. గత 15 రోజులుగా ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యేను బీఆర్ఎస్ అగ్ర నాయకులు పరామర్శించి ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ప్రశ్నించారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందింది. అయితే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను కాంగ్రెస్ అడ్డుకుని చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు మరో 20 మందిపై అక్రమ కేసులు బనాయించి జైలులో బంధించింది.



# మత్తు మందు ఇచ్చి విద్యార్థినిపై లైంగిక దాడి

**నగ్న ఫొటోలు సోషల్ మీడియాలో పెడుతానని బెదిరింపు..!**

**హైదరాబాద్, మార్చి 2:** హైదరాబాద్ బాచుపల్లిలోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినిపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆమెకు మత్తు మందు ఇచ్చిన అశోక్ ఆమెపై లైంగికంగా దాడి చేయడమే కాకుండా.. మాట వినకుంటే నగ్న ఫొటోలను సోషల్ మీడియాలో పెడుతానని ఆమెను బెదిరించాడు. అతడి వేధింపులు తాళలేక సదరు యువతి శనివారం ఆత్మహత్యాయత్నం చేసింది. దాంతో.. విషయం తెలుసుకున్న ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆశిష్ అనే విద్యార్థి గత ఏడాది కాలంగా 'ఏఎన్‌సీ' అనే డార్క్ వెబ్ నుండి తన కూతురికి చాక్లెట్లు, టాబ్లెట్లు ఇచ్చి కాలేజ్, హోటల్లో లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆశిష్ అతని స్నేహితుడు ప్రవీణ్ కూడా వరుసగా తన కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె తెలిపింది. తాను చెప్పినట్లు చేయకపోతే న్యూడ్ ఫోటోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడని, కాలేజ్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందన లేదని బాధితురాలి తల్లి పోలీసుల మందు తన బాధను వెళ్లబోసుకుంది.



# తెలంగాణ కాంగ్రెస్‌కు 'ఏటీఎం'గా మారిందా?

- రాహుల్ పర్యటనపై కేటీఆర్ సెటైర్లు
- అన్నారం బ్యారేజీ కూల్చివేతకు కుట్రలు
- ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలే నిదర్శనమని వ్యాఖ్య
- సూర్యాపేట మైనింగ్‌అక్రమాలపై సీఎంకు బహిరంగ లేఖ



**హైదరాబాద్, మార్చి 2 :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం వికారాబాద్‌లో రాహుల్ పర్యటిస్తున్న వేళ, ఎక్స్ వేదికగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి వ్యంగ్యంగా స్వాగతం పలికిన కేటీఆర్, తెలంగాణను ఏఐసీసీకి 'ఏటీఎం'గా మార్చేశారని ఎద్దేవా చేశారు. గాంధీ కుటుంబానికి రూ.1000 కోట్లు ఇస్తానని గతంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు ఆ నిధుల వసూలు కోసమే రాహుల్ ఇక్కడికి వచ్చారా? అని ప్రశ్నించారు. కేవలం రాజకీయాల కోసమే కాకుండా, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలు చేస్తామని చెప్పిన 6 గ్యారంటీలు మరియు 420 ఇతర వాగ్దానాల పురోగతిపై కూడా రాహుల్ దృష్టి సారించాలని కేటీఆర్ సూచించారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. మేడిగడ్డ తర్వాత ఇప్పుడు అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారని మండిపడ్డారు. బ్యారేజీ పిల్లర్ల వద్ద నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమైన చర్య అని, ఇది అత్యంత పెద్ద నేరమని ఆయన అభివర్ణించారు. కాంగ్రెస్ నేతల ఇసుక మాఫియా పగలు, రాత్రి తేడా లేకుండా వనరులను దోచుకుంటూ బ్యారేజీ ఉనికినే ప్రమాదంలోకి నెడుతోందని ధ్వజమెత్తారు. ప్రాజెక్టును బలహీనపరిచి ఆ నిందను బీఆర్ఎస్‌పై వేయడమే ప్రభుత్వ పన్నాగమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ చేస్తున్న అరాచకాలను అన్నదాతలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

### సూర్యాపేట మైనింగ్‌పై బహిరంగ లేఖ

సూర్యాపేట జిల్లాలో జరిగిన మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములపై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించడం మినరల్ ఆక్షన్ రూల్స్-2015కు విరుద్ధమని ఆరోపించారు. కీలక సాంకేతిక వివరాలు, జియోలాజికల్ నివేదికలు లేకుండానే కంపెనీలను ఎంపిక చేయడంపై ఆయన తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. హైకోర్టు సూచనలను పక్కనపెట్టి, పర్యావరణ అనుమతులు పూర్తికాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడం ప్రభుత్వ పారదర్శకతను ప్రశ్నిస్తోందని అన్నారు. ఈ అక్రమ టెండర్లను తక్షణమే రద్దు చేసి, స్వతంత్ర విచారణ జరిపించాలని, శాస్త్రీయ సర్వేల తర్వాతే కొత్త వేలం నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మొత్తానికి, రాష్ట్ర వనరుల దోపిడీయే ధ్యేయంగా కాంగ్రెస్ 'ప్రజా పాలన' సాగుతోందని కేటీఆర్ నిశిత విమర్శలు చేశారు.

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం

- హిందువులంతా ఐక్యంగా పోరాడాలి
- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కామారెడ్డి, మార్చి 2:** హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వగలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కా ర్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాహుల్ను ఉద్దేశిం చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# మూసీపై బీఆర్ఎస్, బీజేపీ గోల

- గుజరాత్ వెళ్లి వివరాలు తెలుసుకోవాలి
- మండిపడ్డ మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, మార్చి 2:** హైదరాబాద్ నగరంలో మూసీ ప్రక్షాళన చేసి గోదావరి నీటిని తెచ్చి కలపాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే భాజపా, భారాసలు అడ్డుపడుతున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. మూసీ ప్రక్షాళనతో నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సబర్మతి నది ప్రక్షాళనకు, మూసీ ప్రక్షాళనతో సంబంధం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అంటున్నారని, ఆయన మాటలన్నీ అవాస్తవాలని తమ పరిశీలనలో తేలిందన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతి నదిని 22 కిలోమీటర్ల దూరం ప్రక్షాళన చేయడానికి గుజరాత్ ప్రభుత్వం పది వేలమందిని తరలించినట్లు అక్కడి అధికారులే స్వయంగా చెప్పారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలతో కలసి ఆయన సబర్మతి రివర్ ఫ్రంట్‌ను సందర్శించారు. అలగే విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ఆనంద్ అమూల్ పాల కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబర్మతి నీటిని ప్రక్షాళన చేసి పంటలకు అందిస్తున్నారని తెలిపారు. సబర్మతికి నీళ్లు నర్మదా నది నుంచి వస్తుంటే మూసీకి గోదావరి నుంచి తేవాలనేది రాష్ట్రప్రభుత్వ సంకల్పమని వివరించారు. సబర్మతి ప్రక్షాళనకు 2004 నుంచి 2014 వరకు 10 వేల మందిని తరలించినట్లు గుజరాత్ అధికారులు చెప్పారని, కానీ ఎవరినీ తరలించలేదని రామచందర్‌రావు అబద్ధాలాడుతున్నారని శ్రీహరి మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన చేపట్టకుండా.. మురికికూపంలోనే బతుకుదామా అని ప్రశ్నించారు. రేవంత్‌మూసీ ప్రక్షాళన చేస్తే ఎప్పటికీ సీఎంగా ఉండిపోతారని భయపడి భాజపా, భారాస నేతలు వ్యతిరేకిస్తున్నారని చామల చెప్పారు. హరీశ్, రామచందర్‌రావు సబర్మతి ప్రక్షాళన జరిగిన తీరుచూసి మాట్లాడాలన్నారు. అలాగే గుజరాత్ తరహాలో తెలంగాణలో పాడి రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రైతులకు ఆదాయం, మహిళలకు ఆర్థిక సాధికారత, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని శ్రీహరి తెలిపారు. మంత్రి తదితరులు ఆదివారం గుజరాత్‌లోని అమూల్ పాల ఉత్పత్తి ప్లాంటును సందర్శించారు.

# గిరిజన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ ముగింపు

**హైదరాబాద్, మార్చి 2:** హైదరాబాద్ లోని గిరిజన సాంస్కృతిక పరిశోధన-శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గత 5 రోజులుగా జరుగుతున్న గిరిజన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ శిక్షణ సోమవారం విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి శిక్షణను పూర్తి చేసిన 30మంది గిరిజన టీచర్లను అభినందించి తమతమ పాఠశాలల్లో విద్యార్థులకు ఈ ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ కళను నేర్పించి వారి అభిరుచికి, ఆర్థికాభివృద్ధికై కృషి చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వాకులు గిరిజన సాంస్కృతిక పరిశోధన-శిక్షణ సంస్థం సంచాలకులు వేమూరి సముజ్వల మాట్లాడుతూ ఈ అరుదైన శిక్షణ కార్యక్రమానికి వెసులుబాటు కల్పించిన గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సబ్యసాచి ఘోష్‌కి కృతజ్ఞతలు తెలుపడంతో పాటు ఈ శిక్షణలో నైపుణ్యం సాధించినవారు తమ తమ ఐటీడీఏలలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వందలాది మంది విద్యార్థుల అభ్యున్నతికై కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నిష్ణాతులైన అభ్యర్థులు తాము తయారు చేసిన బ్లాక్ ప్రింటెడ్ ఫ్యాబ్రిక్స్ - చీరలు, షాలువాలు, డ్రెస్ మెటీరియల్స్- ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. శిక్షణనిచ్చిన సునీతప్రసాద్ మాట్లాడుతూ ఈ కళకు అంతర్జాతీయ స్థాయి మార్కెట్ రెడీగా ఉందని, రెండు - మూడు రెట్లు లాభం వస్తుందని, గిరిజనులు తయారు చేసిన మెటీరియల్ను కొంతకాలం తమ సంస్థ ద్వారానే కొని వారికి మంచి మార్కెట్ చూపించగలమని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్లు శ్రీ పోచం, సంధ్యారాణి, సూపరింటిండింగ్ ఇంజనీర్ శ్రీమతి హేమలత, గిరిజన మ్యూజియం క్యురేటర్ డా. ద్యావనపల్లిత్యనారాయణ, పీఈటీసీ కోఆర్డినేటర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.



# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

### ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్

**హైదరాబాద్, మార్చి 2:** మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# కుమ్మెర ఘటనపై కలెక్టర్ నివేదిక

### బీసీ కమిషన్‌కు సమర్పించినట్లు వెల్లడి

**హైదరాబాద్, మార్చి 2 :** తెలంగాణ బీసీ కమిషన్ గత నెల 23వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కుమ్మెర జాతర సంఘటనకై నివేదిక కోరడం జరిగింది. కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి 24వ తేదీన కుమ్మెర గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ పంపిన తమ నివేదిక బీసీ కమిషన్‌కు చేరింది. అందులో పాప తండ్రి గణెష్‌కు డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. పాప తండ్రి గణెలిష్‌కు నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్‌సోర్సింగ్ జాబ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాప తండ్రి గణెలిష్‌కు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ రిపోర్టులో 18వ తారిఖునాడు కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తారీఖు వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకుషంగా వివరించడం జరిగింది. 17 ఫిబ్రవరి నుండి 20 ఫిబ్రవరి వరకు ఆ జాతరలో సుమారు 20 వేల భక్తులు పాల్గొన్నారని తెలపడం జరిగింది. పాప తల్లి శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి ఆధారంగా ఆమె ఎటువంటి సర్టిఫికేట్లు ఇప్పటివరకు అందజేయలేదని తెలిపారు. శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి మహమ్మదాబాద్ తహశీల్‌దార్‌కు ఆదేశించగా మౌనిక తల్లి బాలక్రిష్ణమ్మ పిచ్చగుంట్ల (వంశరాజ్) కులానికి చెందినదని తెలపడం జరిగింది.

# గవర్నర్, సిఎం హోళీ శుభాకాంక్షలు

హైదరాబాద్, మార్చి 2: తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతి పండుగగా హోళీని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, ఆప్యాయత సంతోషాల హరివిల్లుగా, శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే పండుగ హోలీ అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సహజ సిద్ధమైన రంగులు, సాంప్రదాయ పద్ధతులతో పండుగను జరుపుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా ప్రజల సమైక్యతను చాటే పండుగ హోళీని వేడుకగా జరుపుకోవాలని అన్నారు. అలాగ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కూడా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజల్లో రంగులు నింపాలని కోరుకున్నారు.

# విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన



**నాగర్ కర్నూలు, మార్చి 2:** సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు కలిసి అభినందించారు. బల్మూరు మండలం తుమ్మన్‌పెట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో నూతన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి.స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతిస్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ ఫ్లలె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.



సంపాదకీయం

# అనిశ్చితిలో ఇరాన్ భవితవ్యం

అమెరికా యుద్ధ దాహానికి ప్రపంచం వణుకుతోంది. బడిత ఉన్నోడిదే బర్రె అన్నచందంగా అమెరికా తన ఆయుధాలతో ప్రపంచాన్ని బెదిరిస్తోంది. దారికి రాని వారిపై దాడికి తెగిస్తోంది. మొన్న వెనిజువెలా, ఇప్పుడు ఇరాన్ దేశాలు దెబ్బతిన్నాయి. ప్రపంచ దేశాల్లో అస్థిరతను సృష్టించడం, తమ దారికి తెచ్చుకో వడం అలవాటుగా చేసుకుంది. ఆయుధాలు లేదా, సుంకాలతో బెదిరిస్తోంది. భారత్‌ను కూడా ఇదే తరహాలో ఇబ్బందులు పెడుతోంది. తాజా యుద్ధంతో భారత్ తన వ్యూహాలను మార్చుకోవాలి. స్వతహాగా ఆలోచన చేయాలి. గతంలో ఇరాక్‌ను ధ్వంసం చేసిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌ను తుదముట్టిం చింది. రేపు ఎవరన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇది నయా నియంతల కాలంగా మారింది. ఓ వైపు అమెరికా, మరోవైపు ఇజ్రాయిల్ కలసి ఆడుతున్న యుద్ధంలో ప్రపంచ దేశాలకు వణుకు పుట్టేలా ఉంది. అయితే ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా హమాస్, హిజ్బుల్ సంస్థలను ప్రోత్సహించి ఇజ్రాయిల్ పతనాన్ని కోరుకుంది. ఇరాన్‌ను అభివృద్ధి చేసుకునే పనిని వదిలి ఇజ్రయిల్‌తో పంతం పెట్టుకుంది. అణు కార్యక్రమాలను విస్తరించుకుంది. అదే ఇప్పుడు ఖమేనీ పతనానికి దారితీసింది. దశాబ్దాల పాటు తిరుగులేని రీతిలో ఇరాన్‌ను శాసించిన అగ్ర నాయకుడు ఖమేనీ..ప్రత్యర్థి దాడిలో సులువుగా ప్రాణాలు కోల్పోవడం ఆశ్చర్యపరయడం లేదు. ఎందుకంటే కొన్ని నెలలుగా ఖమేనీ కదలికలపై దృష్టి పెట్టిన అమెరికా, ఇజ్రాయెల్ మట్టుపెట్ట గలిగాయి. ఆధునిక సాంకేతికతో ఖమేని ప్రాంతాన్ని గుర్తించి దాడి చేసారు. అమెరికా దాడులు దాదాపు ఖాయమని కొద్ది రోజులుగా స్పష్టమవుతున్నా ఆయనను సురక్షితంగా ఉంచడంలో అక్కడి అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అయ్యింది. అమెరికా అందించిన రహస్య సమాచారం ఆధారంగా ఇజ్రాయెల్.. శనివారం మెరుపు వేగంతో స్పందించి దాడికి దిగడంతో తప్పించుకోవడానికి ఖమేనీకి అవకాశం దక్కలేదు. తమ అణు కేంద్రాలను తొలుత లక్ష్యంగా చేసుకోవచ్చని ఇరాన్ నిఘా వర్గాలు భావించాయి. కానీ తొలి దాడి నేరుగా ఖమేనీపైనే జరుగుతుందని ఊహించలేకపోయాయి. ఈ క్రమంలో ఇరాన్ భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఇరాన్ తన ఛాందసవాద పంథాను వీడాలి. ఉగ్రవాదులను ప్రోత్సహించి, ఇతర దేశాలపై పురిగొల్పే విధానాల నుంచి తప్పుకోవాలి. ప్రజలంతా ఎవరికి తోచినట్లు వారు బతికేలా చేసుకోవాలి. పాకిస్తాన్ కూడా ఇలాగే ఉగ్రవాదులను ఎగదోస్తూ వచ్చింది. చివరకు సహనం నశించిన భారత్ ఆపరేషన్ సిందూర్‌తో దాడులు చేసింది. అయితే చావుతప్పి కన్ను లొట్టపోయి నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి మారింది. అఫ్గాన్తోఓ కయ్యానికి దిగింది. ఇది దేశాన్ని అతలాకుతలం చేస్తుందన్న విషయం గుర్తించడం లేదు. ఇక ఇరాన్ కూడా ఛాందసవాద భావాలతో రగిలిపోతోంది. ఖమేనీ రాకతో ఇరాన్ మళ్లీ మతఛాందసవాదంలోకి నెట్టబడింది. అక్కడ ప్రజలు ఇటీవలే ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ప్రభుత్వ దాడుల్లో వేలాదిమంది హతం అయ్యారు. అంతర్గతంగా కూడా ఇరాన్ నాయకత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో అమెరికా కూడా పాచిక వేసి ఖమేనీని మట్టు పెట్టింది. గత ఏడాది ఇరాన్‌లోని అణు స్థావరాలపై దాడికి సన్నద్ధమవుతున్న తరుణంలోనే.. ఖమేనీ ఎక్కడ దాగున్నారో తమకు తెలుసని, కావాలనుకుంటే ఆయనను చంపగలిగి ఉండేవారమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. నాటి నుంచి ఈ పటిష్ట నిఘా నెట్‌వర్క్‌ను అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ కొనసాగించింది. గత ఏడాది 12 రోజుల యుద్ధం సమయంలోనే ఖమేనీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళం మధ్య కమ్యూనికేషన్ సాగుతున్న తీరు, అత్యవసర సమయాల్లో వారు చేపడుతున్న చర్యల గురించి మరింత ఎక్కువగా తెలుసుకుంది. ఇరాన్ సుప్రీం నేత నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించిన జెట్‌లు అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాయి. ఖమేనీ ప్రాంగణం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాలు నిర్ధారించాయి. దానిపై 30 బాంబులను ప్రయోగించి నట్లు తెలుస్తోంది. ఖమేనీపై దాడికి శక్తిమంతమైన 'బంకర్ బస్టర్' బాంబులను కూడా వాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు భవిష్యత్ ఏంటన్నది ఇరాన్ ఆలోచించాలి. ఇరాక్ పతనమైనట్లే ఇరాన్ కూడా పతనమవుతుందా లేక లేచి నిలబడుతుందా అన్నది చూడాలి. ఆయుధ పోటీలో ఇప్పుడు ఈ యుద్ధం పరాకష్టగా చూడాలి. ఇరాన్ ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆలోన తదుపరి నాయకత్వం చేయాలి. ప్రపంచ దేశాల్తో తనకుంటూ స్థానాన్ని పదిలం చేసుకోవాలి. ఎందుకంటే ఆయతుల్లా అలీ ఖమేనీ మరణం ఇరాన్‌కు భారీ దెబ్బ! 37 ఏళ్లుగా దేశాన్ని పాలిస్తున్న ఆయన సేవలను కోల్పోవడంతో టెహ్రాన్ ప్రస్తుతం కొంత ఉక్కిరిబిక్కిరి అవుతుందనడంలో సందేహం లేదు. అయితే- ఖమేనీ కన్నుమూసినంత మాత్రాన.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నట్లుగా ఇరాన్‌లో ఇప్పటికిప్పుడు అధికార మార్పిడి జరిగే అవకాశాలు మాత్రం లేవు! సుప్రీం లీడర్ లేకపోయినా పాలనా వ్యవహారాలు సజావుగా సాగేందుకు అవసరమైన వ్యవస్థ అందుబాటులో ఉండటం, కొత్త పాలకుడి నియామకానికి స్పష్టమైన మార్గనిర్దేశకాలు ఉండటమే అందుకు కారణం. ఖమేనీ మరణంతో ఇప్పటికే ఈ మండలి చేతుల్లోకి ఇరాన్ పాలనా బాధ్యతలు వెళ్లాయి. ఇందులో దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధిపతి ఘొలామ్ హొళసేన్ మొహ్‌సెనీ ఎజెహీలకు తోడు తృతీయ సభ్యుడిగా ఆయతుల్లా అలీ రెజా అరాఫీ ప్రస్తుతం ఎంపికయ్యారు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చింది. అప్పుడు సుప్రీం లీడర్‌గా ఆయతుల్లా రూహుల్లా ఖొమైనీ నియమితులయ్యారు. 1989లో ఆయన చనిపోయాక.. ఖమేనీకి ఆ పదవి దక్కింది. ఖమేనీ కుమారులలో ఒకరైన 56 ఏళ్ల ముజ్తబా ఖమేనీ ప్రస్తుతం దేశాధినేత అవుతారనే ప్రచారం జరుగుతోంది. గతంలో ప్రభుత్వ పదవిని నిర్వహించిన అనుభవమేదీ ముజ్తబాకు లేదు. ఆయన్ను సుప్రీం లీడర్‌గా నియమిస్తే మతపెద్దల కమిటీపై దేశ ప్రజల్లో ఆగ్రహం పెరగొచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించడం మత సిద్ధాంతాలకు విరుద్ధమని కూడా పలువురు చెబుతున్నారు. ఇకపోతే తిరుగుబాటు చేయాలన్న ట్రంప్ సూచనలను ఇరాన్ ప్రజలు అంగీకరించరు. కాబట్టి ప్రస్తుతం అమెరికాను విశ్వసించి ఇరాన్‌వాసులు తిరుగుబాటు చేసే అవకాశాలు లేనట్టే! కొత్త నాయకత్వం ఎవరికి దక్కినా ఇరాన్ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగాలి.

# పశ్చిమాసియాలో ప్రళయ ఘోష

## రగిలిపోతున్న మిడిల్ ఈస్ట్!

- ఖమేనీ మృతి ప్రతీకారంతో రగులుతున్న ఇరాన్
- ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై క్షిపణుల వర్షం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయంపై బాలిస్టిక్ క్షిపణితో దాడి చేశామన్న ఇరాన్
- ఇరాన్ లో ఇప్పటివరకు 550 మంది మృతి
- ఆస్పత్రి, బాలికల పాఠశాలపై బాంబుల మోత
- కువైట్‌లో కూలిన అమెరికా ఎఫ్-15 ఫైటర్ జెట్
- తమ క్షిపణులే కూల్చాయని ఇరాన్ ప్రకటన
- సౌదీ అరేబియాలోని అరామ్‌కో చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్ దాడి
- ఇరాన్ దాడులతో వణికిపోతున్న దుబాయ్..
- బుర్జ్ అల్ అరబ్, పామ్ హోటల్ వద్ద డ్రోన్ శకలాలు
- లెబనాన్‌పైనా ఇజ్రాయెల్ విరుచుకుపడటంతో.. ఏడాది తర్వాత హిజ్బుల్లా మళ్లీ దాడులు
- నాపై హత్యాయత్నం చేసినందుకే ఖమేనీని మట్టుబెట్టాం.. యుద్ధం మరో 4-5 వారాలు ఉ ంటుందన్న ట్రంప్
- యుద్ధం ఎఫెక్ట్.. శంషాబాద్ నుంచి 44 గల్ఫ్ విమానాలు రద్దు.. మిడిల్ ఈస్ట్ ప్రయాణాలపై డీజీసీఏ అలర్ట్



**టెహ్రాన్/జెరూసలెం/వాషింగ్టన్, మార్చి 2:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై ప్రారంభించిన దాడులు, దానికి ప్రతికారం తీర్చుకునేందుకు ఇరాన్ చేస్తున్న ఎదు రుదాడులతో యావత్ మిడిల్ ఈస్ట్ అట్టుడుకుతోంది. యుద్ధం ప్రారంభమైన రోజే ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ కమాండర్లు మరణించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ ఇజ్రాయెల్‌తో పాటు, గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై విరుచుకుపడుతోంది. దాడులు, ప్రతిదాడులతో మూడు రోజులుగా పశ్చిమాసియా దద్దరిల్లుతోంది. ఇరుపక్షాల దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి:

### ఖమేనీ హతం.. ఇరాన్‌లో దాడుల బీభత్సం

అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ రోరింగ్ లయన్/ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా ఇరాన్‌పై భీకర వైమానిక దాడులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు ఒకే షాట్‌లో 48 మంది ఇరాన్ టాప్ లీడర్లు మరణించారు. సోమవారం తెల్లవారుజామున ఉత్తర టెహ్రాన్‌లోని గాంధీ హాస్పిటల్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఆస్పత్రి భవనం ధ్వంసం కాగా, దట్టమైన పొగ కమ్ముకుంది. నర్సులు ప్రాణాలకు తెగించి ఇన్బుబేటర్లలో ఉన్న నవజాత శిశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆసుపత్రులపై దాడుల పట్ల డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మరోవైపు దక్షిణ ఇరాన్‌లోని హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్ మినాబ్‌లో ఉన్న షాజారే తయ్యిబె బాలికల ప్రాథమిక పాఠశాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మృతుల సంఖ్య 165కి చేరుకుంది. మరో 96 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ ఈ దాడిని ఖండించగా, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి దాడి ఫోటోలను ఎక్స్ లో పంచుకున్నారు. శనివారం నుంచి జరుగుతున్న ఈ దాడుల్లో ఇరాన్‌లో దాదాపు 550 మంది పౌరులు, అధికారులు మరణించినట్లు ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. ఇరాన్ నావికాదళ ప్రధాన కార్యాలయం, ఐఆర్‌జీసీ హెడ్‌క్వార్టర్స్, 9 యుద్ధ నౌకలను తాము ధ్వంసం చేశామని అమెరికా ప్రకటించింది.


### నెతన్యాహు కార్యాలయమే లక్ష్యంగా..

సుప్రీం లీడర్ మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్ జీసీ) ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఎయిర్ ఫోర్స్ కమాండర్ కార్యాలయాలను తమ 'ఖైబర్ షెకాన్' బాలిస్టిక్ క్షిపణి విజయవంతంగా ఢీకొట్టిందని ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన చేసింది. అయితే దీనిని ఇజ్రాయెల్ ఇంకా ధ్రువీకరించలేదు. అంతకుముందు ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో జెరూసలేం సమీపంలోని బీట్ షెమేష్‌లో 10 మంది మృతి చెందారు. యుద్ధాన్ని ఆపేందుకు మధ్యవర్తులతో చర్చలు జరుపుతున్నారన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. అమెరికాతో చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

### కువైట్‌లో కుప్పకూలిన అమెరికా జెట్

గల్ఫ్ దేశాలైన యూఏఈ, కువైట్, బహ్రెయిన్, ఖతార్‌లలో ఉన్న అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు చేస్తోంది. కువైట్ గగనతలంలో ఎగురుతున్న అమెరికాకు చెందిన ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను తమ క్షిపణి వ్యవస్థతో కూల్చివేసినట్లు ఇరాన్ వెల్లడించింది. ఇందుకు సంబంధించిన వీడియోను విడుదల చేసింది. అయితే, అక్కడ మోహరించిన ఎంఐఎం-104 పేట్రియాట్ క్షిపణి రక్షణ వ్యవస్థ పొరపాటున ఈ విమానాన్ని కూల్చేసి ఉంటుందని కూడా అనుమానిస్తున్నారు. కూలిపోయే ముందు పైలట్లు పారాచూట్ ద్వారా సురక్షితంగా బయటపడ్డారు. విమాన శకలాలు కువైట్‌లోని మినా అల్ అహ్మది చమురు శుద్ధి కర్మాగారంలో పడటంతో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ డ్రోన్ దాడి జరిగింది. ఈ పరిణామాలతో బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాలు ఇరాన్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

### నాపై హత్యాయత్నం వల్లే ఖమేనీని చంపా: డొనాల్డ్ ట్రంప్



ఈ ఆపరేషన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ప్రోద్బలంతో తనపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయని, నన్ను పట్టుకోకముందే అతడి కథను మొదటి ప్రయత్నంలోనే నేను ముగించానని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో యుద్ధం మరో 4 నుంచి 5 వారాలు జరగవచ్చన్నారు. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారని, మరో ఐదుగురు గాయపడ్డారని వెల్లడించారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటామని, ఇరాన్ మిలిటరీ ఆయుధాలు వీడితే రక్షణ కల్పిస్తామని, లేదంటే చావు తప్పదని హెచ్చరించారు.

### సౌదీ అరామ్‌కోపై దాడి..

సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన రాస్ తనురాలోని 'అరామ్‌కో రిఫైనరీ'పై ఇరాన్ 'షాహెద్-136' డ్రోన్‌తో దాడి చేసింది. భారీగా మంటలు చెలరేగడంతో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేశారు. చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను ఇరాన్ అడ్డుకుంటోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటింది. ధరలు 10 శాతం మేర పెరిగాయి. ఈ యుద్ధం ఇంధన కొరతకు, ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వణికిపోతున్న దుబాయ్ నగరం

పర్యాటకులకు స్వర్గధామమైన దుబాయ్ ఇరాన్ దాడులతో బిక్కుబిక్కుమంటోంది. దుబాయ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ఇరాన్ డ్రోన్లను కూల్చివేస్తున్నప్పటికీ, వాటి శకలాలు పడి నష్టం జరుగుతోంది. జెబెల్ అలీ పోర్టు సమీపంలో ఓ డ్రోన్ పడగా, కృత్రిమ దీవి పామ్ జుమైరాలోని ఓ హోటల్ వద్ద శకలాలు పడి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవనమైన బుర్జ్ అల్ అరబ్‌ను డ్రోన్ శకలాలు తాకడంతో స్వల్పంగా దెబ్బతింది. ముందు జాగ్రత్తగా బుర్జ్ ఖలీఫా, బుర్జ్ అల్ అరబ్‌లను అధికారులు ఖాళీ చేయించారు. అత్యవసర పరిస్థితుల కోసం 1200 పడకల రషీద్ ఆస్పత్రిని సిద్ధం చేశారు. ప్రజలను ఇళ్లలోనే ఉండాలని ప్రభుత్వం సూచించింది.

### రంగంలోకి హిజ్బుల్లా..

ఇజ్రాయెల్ బలగాలు లెబనాన్ రాజధాని బీరూట్‌పైనా విరుచుకుపడ్డాయి. దాదాపు 50 గ్రామాల ప్రజలను ఖాళీ చేయాలని హెచ్చరించాయి. దీనికి ప్రతిగా లెబనాన్ మిలిటెంట్ సంస్థ హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పైకి క్షిపణులను ప్రయోగించింది. 2024లో అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, ఏడాదికి పైగా విరామం అనంతరం హిజ్బుల్లా మళ్లీ ఇజ్రాయెల్‌పై దాడులు చేయడం ఇదే తొలిసారి. బీరూట్‌లో వేలాది మంది ఖమేనీకి నివాళులర్పించారు.

### భారత్‌పై ప్రభావం.. విమానాల రద్దు

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (శంషాబాద్) నుంచి మిడిల్ ఈస్ట్‌కు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి. దోహా, అబుదాబి, జెడ్డా, కువైట్, దుబాయ్, మస్కట్, మదీనా వెళ్లే 22 బయలుదేరే విమానాలు, అక్కడి నుంచి రావాల్సిన మరో 22 విమానాలు.. మొత్తం 44 సర్వీసులను ఎయిర్ ఇండియా, ఇండిగో, ఎమిరేట్స్, కతార్ ఎయిర్‌వేస్ నిలిపివేశాయి. దీంతో విమానాశ్రయం వెలవెలబోయింది. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ (డీజీసీఏ) ప్రయాణికులకు కీలక సూచనలు జారీ చేసింది. ఎప్పటికప్పుడు ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్లలో స్టేటస్ చెక్ చేసుకోవాలని సూచించింది

### దాడిలో గాయపడ్డ ఖమేనీ భార్య మృతి

అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ గత శనివారం తొలిసారి టెహ్రాన్‌పై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే సోమవారం నాడు మరణించినట్టు ఆదేశ అధికారిక వార్తా సంస్థ తెలిపింది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటికే ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనుమరాలు మృతి చెందారు. ఖమేనీ మృతితో ఇప్పటికే ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, తాజాగా మన్సూరే ఖోజాస్తే కూడా మ-రణించడంతో టెహ్రాన్ నాయకత్వంపై ఒత్తిడి పెరిగి ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సామ్రాజ్యవాద శక్తుల దాడులను భీకరంగా తిప్పికొడతామని ఇప్పటికే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని మోదీ ఆరా

- అరబ్ దేశాల అధినేతలతో ఫోన్ లో సంభాషణ
- భారతీయుల భద్రతపై కీలక చర్చలు
- ఢిల్లీలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమీటీ అత్యవసర భేటీ



**న్యూఢిల్లీ, మార్చి 2:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాలకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఫోన్ చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు.

### నెతన్యాహుతో మాట్లాడిన మోదీ

దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోన్ లో మాట్లాడారు. తాజా ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. సంభాషణకు సంబంధించి ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా కీలక విషయాలను పంచుకున్నారు. యూఏఈ అధ్యక్షుడిని తన 'సోదరుడు' అని సంబోధిస్తూ, అక్కడ జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా యూఏఈలో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత పట్ల ఆ దేశం చూపుతున్న శ్రద్ధకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

### అత్యవసరంగా భేటీ అయిన క్యాబినెట్ కమీటీ

అంతకుముందు ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమీటీ అత్యవసరంగా భేటీ అయ్యింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ సమావేశంలో పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాలు, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై ప్రధానంగా చర్చించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా విశ్లేషించారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా తలెత్తే రాజకీయ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ కమీటీ కసరత్తు చేసింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే ఈ కమీటీ, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అనుసరించాల్సిన విదేశాంగ విధానం, అంతర్జాతీయ వేదికలపై వినిపించాల్సిన స్వరంపై స్పష్టతనిచ్చింది. యుద్ధం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని కనిష్ఠం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# ముస్తాబయిన రాధాకృష్ణుల ఆలయం



■ విభిన్నంగా గిరిజనుల హోలీ జాతర

**విజయనగరం,మార్చి2 :** చింతపల్లి మండలంలోని తాజంగి పంచాయతీ కేంద్రం బీటాలైన్‌లో గల రాధాకృష్ణుల ఆలయం హోలీ జాతరకు ముస్తాబయింది. ఇక్కడ ఏటా హోలీని విభిన్నంగా జరుపు కుంటారు. తాజంగి పంచాయతీ బీటాలైన్‌లో ఒడిశా నుంచి వలస వచ్చిన 300 కుటుంబాల ఆదివాసీలు సుమారు 85 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. స్థానిక గిరిజనులు గ్రామంలో రాధాకృష్ణుల ఆలయాన్ని నిర్మించి ప్రతి ఏటా హోలీ రోజున పండుగ జరుపుకుంటున్నారు. ఆదివాసీలు ప్రతీ ఏడాది హోలీకి ముందు రోజు నుంచి స్థానిక రాధాకృష్ణుల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. హోలీని పురస్కరించుకుని సంప్రదాయంగా భక్తులు ఆలయం ఎదుట 70 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన కర్రల పోగును మంగళవారం కాలుస్తారు. ఆ వేడుకలో స్వయంగా పాల్గొనేందుకు పలు గిరిజన గ్రామాలు, మైదాన ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆరేళ్ల క్రితం ఆలయాన్ని ఆధునికీకరించారు. అయితే బీటాలైన్ ఆదివాసీలు విభిన్నంగా జరుపుకునే హోలీ వేడుక పూర్వం నుంచి కొనసాగుతున్నది. ఈ ఏడాది హోలీ వేడుకలకు రాధాకృష్ణుల ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం రాత్రి భక్తుల కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వేకువజామున నాలుగు గంటలకు హోలీ సంబరం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా కర్రల పోగును కాల్చే వేడుకను నిర్వహిస్తారు. ఇప్పటికే స్థానిక భక్తులు 70 అడుగుల కర్రల పోగును సిద్ధం చేశారు. ఈ కర్రల పోగును మంగళవారం ఉదయం ఐదు గంటలకు కాలుస్తారు. ఈ కర్రల పోగుపైన ఒక జెండాను తాడుతో ఎగురవేస్తారు. ఈజెండాను పట్టుకోవడానికి కర్రల పోగు చుట్టూ యువ భక్తులు నిరీక్షిస్తుంటారు. ర్రలపోగు కాలిపోయి జెండా గాలిలోకి ఎగురుతుంది. ఈ జెండాను పట్టుకున్న వ్యక్తిని భక్తులందరూ ఎత్తుకుని అతని గృహం వరకూ గిరిజన సంప్రదాయ నృత్య కళాప్రదర్శనలతో తీసుకొస్తారు. జెండాను పట్టుకున్నవ్యక్తికి ఆలయ కమిటీ నగదు బహుమతిగా రూ.1116 అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. ఈ జెండాను పట్టుకున్న కుటుంబానికి ఏడాదంతా శుభం జరుగుతుందని స్థానిక భక్తుల నమ్మకం. ఈ ప్రాంత గిరిజనులందరూ ఈ జెండా పట్టుకున్న వ్యక్తితోనే రానున్న ఖరీఫ్ సాగులో తొలి విత్తనాల నాట్లు వేయిస్తారు. జెండా పట్టుకున్న వ్యక్తితో నాట్లు వేయిస్తే అధిక దిగుబడులు వస్తాయనేది ఆదివాసీల విశ్వాసం. బీటాలైన్‌లో ప్రతి ఏటా జరిగే హోలీకి మరో ప్రత్యేకత వుంది. సుమారు 20 ఏళ్ల క్రితం హోలీ పండుగ సమయంలో ఇష్టమైన అమ్మాయి చేయిపట్టుకుని గృహానికి తీసుకువెళితే వారిద్దరికీ వివాహమైనట్లుగా గిరిజనులు భావించేవారు. ప్రతి ఏటా ఈ హోలీ పండుగ సమయంలో సుమారు 20 - 30 జంటలు చేయి పట్టుకునే పద్ధతిలో కలిసేవారని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం మహిళా చట్టాలపై ప్రజల్లో చైతన్యం పెరగడం, చట్టాలను మరింత కఠినతరం చేయడంతో ఈ చేయిపట్టుకుని తీసుకువెళ్లే ఆచారానికి స్థానిక గిరిజన యువత పూర్తిగా స్వస్తి పలికింది.

# ఎస్సార్సీ లాబొరేటరీస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

- నైపర్‌లో ఇంక్యూబేషన్ సెంటర్ కు గాను పురష్కారం ప్రదానం
- అవార్డును అందుకున్న ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి




**సమయం న్యూస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన 'ఆవిష్కరన్' – బయో నెస్ట్ ఇంక్యూబేషన్ సెంటర్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఫార్మా రంగంలో స్టార్ట్ అప్‌లను ప్రోత్సహిస్తూ ఇంక్యూబేషన్ సెంటర్ ఏర్పాటు చేసిన ప్రముఖ ఔషధ సంస్థ ఎస్సార్సీ లాబొరేటరీస్ కు ఈ సందర్భంగా ప్రత్యేక అవార్డు ప్రదానం చేశారు. ఆవిష్కరన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వి. సాయి కిషోర్ చేతుల మీదుగా అవార్డును ఎస్సార్సీ ల్యాబొరేటరీస్ సంస్థ ఎండీ, బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరస్ అసోసియేషన్ అఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అందుకున్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకోవడం తమ సంస్థకు గర్వకారణమని తెలిపారు. యువ శాస్త్రవేత్తలు మరియు స్టార్ట్ అప్ సంస్థలు పరిశోధన, ఆవిష్కరణల దిశగా ముందుకు సాగేందుకు NIPER వంటి సంస్థలు దృఢమైన వేదికగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత ఫార్మా రంగం గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని, భవిష్యత్తులో మరింత ప్రగతి సాధించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్, స్టార్ట్ అప్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ద్వారా ఔషధ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా నైపర్ సంస్థలను బలోపేతం చేయడం ద్వారా ఫార్మాస్యూటికల్ విద్య, పరిశోధన రంగాలను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ఆవిష్కరన్ మరియు బయో నెస్ట్ కేంద్రం ద్వారా పలు స్టార్ట్ అప్‌లు అభివృద్ధి చెందుతూ ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నాయని పేర్కొన్నారు. భారత్ ఇప్పటికే ప్రపంచానికి ఔషధాలను అందించే ప్రధాన దేశంగా నిలిచిందని, నైపర్ వంటి జాతీయ స్థాయి సంస్థల బలోపేతంతో ఫార్మా రంగం మరింత బలపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు మరియు ఫార్మా రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని క్షేమంగా వెనక్కి తీసుకురండి

-మొదటిపేజీ తరువాయి

సీఎం స్పష్టం చేశారు. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన ఏపీ వాసులను క్షేమంగా వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. యుద్ధం, విమాన సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే గుర్తించి సహాయం అందించాలన్నారు. ఆయా దేశాల్లోని భారతీయ ఎంబసీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆర్టీజీఎస్, ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. గల్ఫ్ దేశాల్లోని తెలుగు వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, విమానాశ్రయాలు తిరిగి తెరుచుకుని సర్వీసులు ప్రారంభమయ్యే వరకు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని చంద్రబాబు సూచించారు. ఏపీ ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా అవసరమైన వారికి తాత్కాలిక వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం కారణంగా విమానాశ్రయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బాధితుల కోసం ప్రభుత్వం 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ఏర్పాటు చేసింది.

**హెల్ప్‌లైన్ నెంబర్లు: ఫోన్: 0863-2340678**
**వాట్సాప్: 85000 27678**



అన్ని ప్రభుత్వ శాఖల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగించుకోవడం ద్వారా పాలనలో సమర్థత మరింత పెంచుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. డ్రోన్, సీసీ టీవీ కెమేరాలు, శాటిలైట్ సమాచారాన్ని సమీకృతం చేసి వినియోగించుకునేలా ఒక మెకానిజం తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు, పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం**

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్ స్టేషన్లలో తాగునీటికి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా జరిగేలా పరిస్థితులు ఉండాలన్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా, బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పుంగనూరు, వెంకటగిరి, పెనుకొండ, ప్రొద్దుటూరు, ఎమ్మిగనూరు, శ్రీకాళహస్తి బస్ స్టేషన్‌లో తాగునీరు, టాయిలెట్స్, ఫ్యాన్స్, సీటింగ్ ఏరియాపై ప్రయాణికుల నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దీపం పథకం కింద ఇస్తున్న గ్యాస్ సిలిండర్ల డెలివరీకి డబ్బులు వసూలు చేయకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీలో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా అట్టడుగు స్థానంలో ఉన్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం దగ్గరున్న సమాచారం కాకుండా, అదనపు సమాచారం కోసం మాత్రమే ఇకపై సర్వేలు జరపాలి తప్ప, పదేపదే ఒకేరకమైన సమాచారం కోసం ప్రజలను, ప్రభుత్వ సిబ్బందిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో వాట్సప్ మనమిత్ర సేవలను మరింత విస్తృతం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వాట్సప్ సేవల సంఖ్యను 953కి పెంచినట్టు తెలిపారు. వీటన్నింటినీ సులభంగా వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది ప్రవర్తనపై సంతృప్తి వ్యక్తమైందని అధికారులు సీఎంకి వివరించారు. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలని చెప్పారు. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలని తేల్చిచెప్పారు.



# ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

## ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి
## బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ
## అధికారులకు సిఎం చంద్రబాబు సూచన

**అమరావతి, మార్చి 2:** ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

# గల్ఫ్‌లో చిక్కుకున్న వారి కోసం హెల్ప్‌లైన్

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

**అమరావతి, మార్చి 2:** ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారిని క్షేమంగా రాష్ట్రానికి తీసుకొస్తామని చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి, ఏపీఎన్నార్టీఎస్ అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. అందుకోసం చర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు. సోమవారం అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారికి ఏపీఎన్నార్టీఎస్ కోఆర్డినేటర్ల ద్వారా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. అలాగే తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లు వినియోగించుకోవాలంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి సూచించారు. తమ సమస్యలు.. ఏపీఎన్నార్టీఎస్ హెల్ప్‌లైన్ నెంబర్ 0863-2340678కు చెప్పొచ్చని తెలిపారు. ఈ నెంబర్ వారంలో ఏడు రోజులు.. 24 గంటలు సైతం పని చేస్తుందని పేర్కొన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ ?91 85000 27678 సమస్యలు చెప్పొచ్చంటూ గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వివరించారు. ఇక ఈ-మెయిల్: ఠ।÷ఠ్గై÷తిని।అజూనిసబిబ.ఇనీపను సంప్రదించవచ్చు వారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి సాయం

## ఆర్టీజిఎస్ అధికారులకు బాధ్యతలు

**అమరావతి, మార్చి 2:** ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య నెలకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో వివిధ దేశాల్లో చిక్కుకున్న తెలుగు వారికి సహాయం చేయాలని ఏపీ ప్రభుత్వ నిర్ణయించింది. అందుకు సంబంధించి ఎన్ఆర్టీ, ఆర్టీజీఎస్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని.. పౌరులు సురక్షితంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ.. వేలాది మంది భారతీయులు అక్కడ చిక్కుకుపోయారు. వారిని సహాయం అందించడంతోపాటు సురక్షితగా వెనక్కి తీసుకు వచ్చేందుకు భారత విదేశాంగ శాఖ తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అలాగే తెలుగు వారిని ఆయా రాష్ట్రాలకు తీసుకు వచ్చేందుకు ఇరు ప్రభుత్వాలు ఇప్పటికే చర్యలు చేపట్టాయి. అందుకోసం హెల్ప్ లైన్ నెంబర్లతోపాటు వాట్సప్, ఈ మెయిల్ ద్వారా తమను సంప్రదించాలంటూ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే వాటిని విడుదల చేశాయి.

# రైతులకు ప్రభుత్వం శుభవార్త

## పెండింగ్ విద్యుత్ కనుక్షన్లకు ఆమోదం

**అమరావతి,మార్చి2 :** కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఏపీలో రైతులకు ఊరట లభించింది. పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించిన ఆదేశాలు సోమవారం జారీ చేసింది. ఈ నెలాఖరులోగా అనుమతులు జారీ చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. మొత్తం పెండింగ్ దరఖాస్తులు: 46,113 ఉండగా.. వీటికి రూ.250 కోట్ల మేర ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం 22.30 లక్షలు ఉన్నాయి. కొత్తగా ఇప్పటికే 1.12 లక్షల కనెక్షన్లు మంజూరు చేసింది. పెండింగ్‌లో ఉన్నవి క్లియర్ చేయడానికి మరో 10,000 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించనుంది. ఈ పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని డిస్కంలను విద్యుత్ శాఖ మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సాగు సీజన్‌కు ముందే వేలాది మంది రైతులకు విద్యుత్ సౌకర్యం లభించే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా 34 వ వార్షికోత్సవ వేడుకలు

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమంగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప

● వివేకా విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు,అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తూన్నారు-సివిల్ జడ్జ్




**అమనగల్,మార్చి,02-03(సమయం న్యూస్) :** స్థానిక ఆమనగల్ పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాపించి 34 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప హాజరయ్యారు. వీరితోపాటు సీనియర్ ఉమెన్స్ ఎన్. సీ. సీ ఇన్స్ట్రక్టర్ సరోజ బాల ఠాగూర్, డాక్టర్ బి పుల్లయ్య కూడా హాజరయ్యారు. మెజిస్ట్రేట్ కాటమ్ స్వరూప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వివేక విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. గతంలో ఇదే పాఠశాలలో చదివి వివిధ ఉన్నత స్థాయిలలో రాణిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సాధారణ బడ్జెట్ పాఠశాల స్థాయిలో ఉండి కూడా కార్పొరేట్ పాఠశాలలను మించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. మండల స్థాయి, జిల్లాస్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు ప్రిన్సిపాల్ మహమూద్,ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఐదవ రోజు ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు

- ఇంటర్మీడియట్ విద్యాధికారి- మాధవి

**మెదక్ మార్చి2( సమయం న్యూస్).:** ఈరోజు జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర బోటనీ × , పొలిటికల్ సైన్స్-1 ,మ్యాథ్స్ -1 బా పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. మొదటి సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగం లో 6706 గాను 6401 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 612 గాను 592 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో ఐదవ రోజు హాజరు శాతం 95.55% గా నమోదైంది. ఈ సంవత్సరం ఐదు నిమిషాలు నిబంధన అమలు లో ఉండటంతో విద్యార్థులందరూ సమయానికి పరీక్షా కేంద్రాల కు చేరుకున్నారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పర్య వేక్షించారనీ ఒక ప్రకటనలో తెలిపారు.

# మాజీ స్పీకర్ శ్రీపాద రావు 89 వ జయంతి వేడుకలు.



**హైదరాబాద్ మార్చి2( సమయం న్యూస్). :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభాపతి, స్వర్గీయ శ్రీ దుద్దిళ్ళ శ్రీపాద రావు గారి 89 వ జయంతి సందర్భంగా శాసనసభ భవనంలోని లాంజ్ లో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, శాసన పరిషత్ చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్ గారు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు, అసెంబ్లీ విప్ ఆది శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి. నరసింహా చార్యులు, అసెంబ్లీ సెక్రటరి రేండ్ల తిరుపతి, అధికారులు.



# జిల్లా ప్రజలకు హోళీ శుభాకాంక్షలు : కలెక్టర్

**నిజామాబాద్, మార్చ్ 2 ( సమయం న్యూస్)** హోళీ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా ప్రజలకు హోళీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోళీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హోళీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హోళీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి మేదో మిత్ర గణిత పరీక్షలో.. ప్రతిభ కనబరిచిన నవీన ఆదర్శ స్కూల్ విద్యార్థులు..




**కొడంగల్ మున్సిపల్, మార్చి,02-03(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర స్థాయి మేదో మిత్ర గణిత పరీక్షలో ప్రతిభ కనబరిచిన కొడంగల్ నవీన ఆదర్శ స్కూల్ విద్యార్థులురాష్ట్రస్థాయి నాలుగో ర్యాంకుసాధించిన పవన్ కుమార్. ఒకటో తరగతి,రాష్ట్రస్థాయి ఐదో ర్యాంకు సాధించిన బి రోహిత్ కుమార్. ఆరో తరగతి , డిస్టిక్ ఐదు ర్యాంకు సాధించిన ఆదిత్య చారి, ఒకటో తరగతి డిస్టిక్ థర్డ్ ర్యాంకు సాధించిన దివ్యశ్రీ ఐదో తరగతి, డిస్టిక్ నాలుగో ర్యాంకు సాధించిన హారిక ఐదో తరగతి.. వీరందరికీ ఈ రోజు హైదరాబాదులోని కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజ్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆడిటోరియంలో పట్నా హై కోర్ట్ మాజీ జస్టిస్ ఎల్ . నరసింహరెడ్డి, కేశవ మెమోరియల్ ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ ఢ ఫౌండర్ నితిన్ సహస్ర,. మేధో మిత్ర ఆర్గనైజేషన్ డైరెక్టర్లు మెమెంటోస్, మెడల్స్, సర్టిఫికెట్లు, నగదు బహుమతి వెయ్యి రూపాయలు అందజేశారు.అభినందించారు .అలాగే నవీన ఆదర్శ హైస్కూల్ ప్రిన్సిపాల్ డివి.నరేష్ రాజుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెంట్ అవార్డు అందుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంతోష విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు..

# కొడంగల్ నియోజకవర్గంలో మంజూరు అయిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

● సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం.



**కొడంగల్ మున్సిపల్, మార్చి.02-03-2026 :** కొడంగల్ లో కడా కార్యాలయంలో కొడంగల్ లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై వికారాబాద్, నారాయణపేట జిల్లాలకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... కొడంగల్ మరియు నారాయణ పేటకు సంబంధించిన రోడ్డు నిర్మాణ పనులు, ఎలక్ట్రిసిటీ,త్రాగు నీరు, బగీరథ మిషన్ పైపు లైన్ లు, పంచాయతీ రాజ్ మరియు ఆర్ అండ్ బి, టి జి ఇ డబ్ల్యుఐ డి సి,పబ్లిక్ హెల్త్ శాఖ ల ద్వారా ఇప్పటికే మంజూరైన వివిధ నిర్మాణ పనులు ప్రారంభించిన వాటిని, పూర్తి అయిన పనులను అనుకున్న లక్ష్యం మేరకు పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇ డబ్యూ ఐ డి సి ద్వారా మంజూరు అ యి మొదలు పెట్టిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలనీ, అన్ని శాఖ ల సమన్వయ తో పని చేయాలనీ అధికారులకు సూచించారు .ఎండా కాలం లో త్రాగు నీటి సమస్య రాకుండా చూడాలని,ఏదైనా సమస్య ఎదురైతే మా ద్రుష్టి కు తీసుకు రావాలని,ఆర్ అండ్ బి ద్వారా చేపట్టే పనులను వెటర్నరీ, వైద్య కళాశాలలకు సంబంధించిన పనులను త్వరలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చేసే పనిలో ప్రోగ్రెస్ ఉండాలని, నిర్మాణ పనులకు సంబంధించిన ఫోటోలు పంపించాలని సూచించారు. అనంతరం టి జి ఇ డబ్లయు ఐ డిసి ద్వారా చేపట్టిననిర్మాణ పనులు, దుద్యాల మండలానికి సంబందించిన ఇంటిగ్రెటెడ్ బిల్డింగ్స్ నిర్మాణ పనులను హకీంపేట్ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి,ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణం యొక్క ప్లాన్ ను పరిశీలించారు. జరుగుతున్న ప్రతి పనికి సంబందించిన పనులు జరుగుతున్న క్రమం లో ఏవైనా సమస్య లు ఎదురైతే మా ద్రుష్టి కి తీసుకురావాలన్నారు. ముఖ్యశీగా వేసవి కాలం ఉన్నందున త్రాగునీటీ సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ముందుగా కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి వివిధ అభివృద్ధి పనుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ హార్స్ చౌదరి,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి పంచాయతి రాజ్ డి ఇ ,సుదర్శన్,ఆర్ అండ్ బి ఇ ఇ శ్రీధర్ రెడ్డి ఎలక్ట్రిసిటీ ఎస్ ఇ రవి ప్రసాద్,ఈడబ్ల్యూఐడిసి ఇఇ,కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, కొడంగల్, నారాయణ పేట్ సంబందించిన ఇంజినీరింగ్ విభాగం ఇఇ, డిఇలు సంబంధిత అధికారులు,తదితరలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

-- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 02( సమయం న్యూస్). :** గ్రామాల సర్వతోముఖాభివృద్ధిలో సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, నూతనంగా ఎన్నికైన సర్పంచులు బాధ్యతా యుతంగా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు (నాలుగు మండలాలకు చెందిన 4వ బ్యాచ్) నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణా కార్యక్రమానికి సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కలెక్టర్ సర్పంచులను ఉద్దేశించి మాట్లాడుతూ,శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో గ్రహించి, శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామానికి మంచి చేయాలన్న, గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేయాలని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా పరిష్కరించాలి, అందుబాటులో ఉన్న నిధులను ఎలా సక్రమంగా వినియోగించుకోవాలి వంటి అంశాలపై ఈ శిక్షణ ద్వారా స్పష్టత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యతని అన్నారు. నిధులను సక్రమంగా వినియోగించి, ప్రాధాన్యత ఆధారంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను మార్చి 31 లోగా పూర్తిచేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వేసవి కాలంలో నీటి సరఫరా సవ్యంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేయాలని సర్పంచులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన మెటీరియల్‌తో కూడిన బ్యాగులను జిల్లా కలెక్టర్ సర్పంచులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు, డి.డబ్ల్యూ.ఓ లలిత కుమారి ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కరీం నగర్ మార్చి2( సమయం న్యూస్) :** జిల్లాలో కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాల, భగత్ నగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్ కి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఘనంగా శ్రీపాదరావు జయంతి



**కరీంనగర్ మార్చి2( సమయం న్యూస్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అధికారికంగా ఘనంగా నిర్వహించారు. కరీం నగర్ బస్టాండ్ చౌరస్తాలో గల శ్రీపాదరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్ సహా పలువురు అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

● బీజేపీ నేత నీల స్వామి.





**రాయపోల్, మార్చి 2 :** మండల పరిధిలో సగానికి పైగా రైతులు సాగు చేసిన పొద్దుతిరుగుడు పంటలు ప్రస్తుతం కోత దశలోకి వచ్చాయని,కొంత మంది రైతులు పంటను కోసి సరైన నిల్వ సౌకర్యాలు లేకపోవడంతో రోడ్డుపై ఆరబోస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నీల స్వామి అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అకాల వర్షాల భయం కారణంగా రైతుల్లో ఆందోళన నెలకొందని,ఈ నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి పొద్దుతిరుగుడు పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకుండా,ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పంటను రోడ్డుపై ఆరబెట్టడం వల్ల రవాణా అంతరాయం కలగడమే కాకుండా,పంట నాణ్యత దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు ఊరటనివ్వాలని ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసన సభాపతి, స్వర్గీయ శ్రీ దుద్దిళ్ళ శ్రీపాద రావు గారి జయంతి సందర్భంగా సోమ వారం కలెక్టరేట్ సమా వేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్ట ర్ రాజ ర్షిషా. పాల్గొన్న ఆర్డీఓ స్రవంతి, డిఆర్డీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, ఏవో వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు.

# పేట కలెక్టరేట్ లో ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు

- చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన
- స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి



**నారాయణపేట, మార్చి,02-03(సమయం న్యూస్) :** దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి శ్రీ పాద రావు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని అభివర్ణించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాపాడడంలో విశిష్ట పాత్ర పోషించారని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని పేర్కొన్నారు. దుద్దిళ్ల శ్రీపాద రావు02 మార్చి 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ధన్వాడ గ్రామంలో జన్మించారనీ, స్వగ్రామంలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి, మంథనిలో ఉన్నత విద్యను అభ్యసించారని, ఆ తర్వాత హైదరాబాద్ లో ఇంటర్మీడియట్, బి.ఎస్సి., ఆర్ట్స్ , లా విద్యలను అభ్యసించారనీ ఆయన తెలిపారు. కాగా విద్యార్థి దశ నుంచే ప్రజా సేవా కార్యక్రమాలలో శ్రీ పాద రావు చురుకుగా పాల్గొని నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారన్నారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడైన ఆయన, ధన్వాడ గ్రామ సర్పంచ్‌గా పలు మార్లు సేవలందిం చారు. మంథని నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి విశిష్ట సేవలందించారనీ చెప్పారు. స్పీకర్ గా ఆయన నిష్పాక్షికత, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల అంకితభావంతో సభా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పార్టీలకు అతీతంగా గౌరవం పొందిన నాయకుడిగా గుర్తింపు పొందారని, సభ గౌరవాన్ని కాపాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. గ్రామాభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన కృషి విశేషమైనదని సరళత, సమగ్రత, నిబద్ధత ఆయన వ్యక్తిత్వ లక్షణాలుగా నిలిచాయన్నారు. 1999 ఏప్రిల్ 13 న కరీంనగర్ జిల్లా అన్నారం గ్రామ సమీపంలో దుర్మరణం చెందారని, ఆయన సేవలు, ప్రజాస్వామ్య పరిరక్షణలో చూపిన అంకితభావం, ప్రజా సేవ పట్ల నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, డిఆర్డిఓ మొగులప్ప, కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, డిపిఆర్ఓ రషీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, డిపిఓ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక వైషమ్యాలకు చరమగీతిక

- సర్వమతాల సమ్మేళనానికి ప్రతీకగా నిలిచిన హజ్రత్ ఇంకుషావలి దర్గా.







**జమ్మికుంట మార్చి2( సమయం న్యూస్) :** అక్కడ...మతస్థులెవరో అప్రస్తుతం...ఆధ్యాత్మికతే ప్రధానం. విశ్వాసాలు వేరైనా ఆ ప్రార్థన మందిరంలో జరిపే ప్రార్థనలపై భక్తులకు అచంచల విశ్వాసం. మత,వర్గ,సామాజిక వైషమ్యాలకు అక్కడ తావులేదు.... సామరస్యానికి అంతులేదు. ఎనిమిది వందల యాభై ఏళ్ళకు పైగా ఇదే తీరున కొనసాగుతున్న ఆ ప్రశాంత ఆధ్యాత్మిక ప్రదేశం బిజిగిర్ షరీఫ్ దర్గా...మానవీయ విలువలకు రాచమార్గం.

**దర్గా చరిత్రపై ప్రత్యేక కథనం...**

ఎవరే మత విశ్వాసానికి చెందినా అందరు అక్కడ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలిని ఆరాధిస్తారు. ఈ దర్గా విభిన్న మతాల విశ్వాసాలు, సంస్కృతులకు నెలవుగా విలసిల్లుతూ మతసామ-రస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. వైషమ్యాలు అసలే కానరాని ఈ చోట హిందు ముస్లిం,క్రైస్తవులు, సిక్కులు సోదర భావం ప్రదర్శిస్తారు. ప్రజల విశ్వాసాలకు చారిత్రక చిహ్నంగా నిలిచిన ఈ దర్గాకు ఎనిమిది వందల యాభై సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉంది.

**దర్గా ప్రాశస్త్యం:**జమ్మికుంట పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో వున్న బిజిగిర్ షరీఫ్ గ్రామంలో ని ఈ దర్గాలో ఇస్లాంతో పాటు విశ్వమానవ సమానత్వాన్ని చాటిన సోదరులు హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి రహ్మతుల్లాహ్ అలై, హజ్రత్ సయ్యద్ ఆజ్మత్ షావళితో పాటు వారి కుమారులైన హజ్రత్ సయ్యద్ ముర్తుజాషావళి, హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి సమాధులున్నాయి. 11వ శతాబ్దంలో నిర్మించిన ఈ దర్గా దగ్గర విశాలమైన గుట్టలు, ప్రకృతిరమణీయత, ఆహ్లాదకరమైన వాతావరణానికి అనుసంధానమై ఉంది. చారిత్రక కట్టడాలు, చుట్టూ అందమైన కమాన్ నిర్మాణాలు ఉన్నాయి. ఇస్లాంతో పాటు అల్లాహ్ సందేశాన్ని దివ్య ఖురాన్ లోని సూక్తులను ప్రజలకు తెలియజేస్తూ విశ్వమానవ సమానత్వాన్ని చాటుతు అరబ్బు దేశం నుండి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తు బిజిగిర్ షరీఫ్ గ్రామానికి చేరుకొని దర్గాను నిర్మించుకున్నా హజ్రత్ సయ్యద్ ఇంకుషావళి తన జీవిత కాలంలో ప్రదర్శించిన మహిమలు,బాధితుల పట్ల చూపిన కరుణ దయవల్ల ఎందరో ప్రజలు సుఖశాంతులతో జీవనం గడుపగలిగారు నిష్ఠలతో వేడుకునే భక్తుల కోరికలను హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి తీర్చుతారని ప్రసిద్ధి వీరి సంస్మరణార్థం ప్రతి ఏటా బక్రీద్ పండుగ సందర్భంగా మూడు రోజులపాటు సందల్, ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.

**భక్తుల కొంగు బంగారం బిజిగిర్ షరీఫ్ దర్గా భక్తుల నమ్మకం:-**మానసిక రోగుల రుగ్మతులను పారద్రోలుతు దశదిశలో వ్యాపిస్తున బిజిగిర్ షరీఫ్ దర్గా అంటే ఈ ప్రాంతంలో తెలియని వారుండరు. ఈ దర్గాను సందర్శించే వారు మానసిక, శారీరక ఇబ్బందులు తొలిగి ఆరోగ్యవంతులుగా తయారవుతారని భక్తుల విశ్వాసం నిత్యం వివిధ ప్రాంతాల నుండి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తులతో దర్గా ఎంతో సందడిగా ఉంటుంది. ప్రజల భక్తి విశ్వాసాలకు చరిత్రక చిహ్నంగా నిలిచిన ఈ దర్గాపై భక్తులకు ఎనలేని విశ్వాసం ఉంది.

అనేక రుగ్మతులు దీర్ఘకాలిక రోగాలు, మానసిక రోగాలు నయం కావాలని తమ పిల్లలకు మంచి పెళ్ళి సంబంధాలు రావాలని, పాడిపంటలు పండాలని,ఉన్నత ఉద్యోగాలు సాధించాలని చదువు ఆరోగ్యం బాగుండాలని తమ కోరికలను ఒక్క కాగితం మీద వ్రాసి హజ్రత్ ఇంకుషావళి సమాధి వద్ద ముడుపులు కడుతారు. తమ మొక్కులు తీరగానే ముడుపును విప్పి ఆది, గురు, శుక్రవారాల రోజులలో "కందుర్లు" పేరిట తమ మొక్కులు తీర్చుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులతో కలిసి సామూహిక భోజనాలు చేస్తారు. సంతానం లేని వారికి ఇక్కడ వేడుకున్నక పిల్లలు పుడితే వారి తలనీలాలు ఇక్కడే సమర్పిస్తారు. అనారోగ్యం,వివిధ సమస్యలతో వచ్చినవారు రోజుల తరబడి దర్గా వద్ద ఉండీ ప్రార్థనలు చేస్తే ఏ కోరికైనా తీరుతుందనే విశ్వాసం భక్తులలో ఉండగా, రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్ వంటి ఇతర ప్రాంతాల వారు వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. దర్గా ఎదురుగా ఉన్న అతిపురాతనమైన వేపచెట్టు ఆకులు సందల్ షరీఫ్ సమయంలో తింటే రోగాలు నయమవుతాయని వేప ఆకులు తియ్యగా ఉంటాయని భక్తుల నమ్మకం.

**భక్తుల వితరణ:-**1991లో కీర్తిశేషులు ఎం.ఏ.సత్తార్ ఖాద్రి దర్గా వద్ద నాలుగు మీనార్ ల నిర్మాణం,రేకుల షెడ్డు నిర్మాణం, బోర్ వెల్,రెండు మంచినీటి ట్యాంకుల నిర్మాణం,జామే మస్జిద్ ముందు రేకుల షెడ్డు నిర్మాణం పనులు చేశారు. కొత్తగూడెంకు చెందిన భక్తుడు గాజి గోవర్ధన్ దర్గా వద్ద సుమారు ఏడు లక్షల రూపాయల విలువజేసే షెల్టర్ నిర్మాణం మరియు పన్నెండు లక్షల రూపాయల విలువజేసే స్లాబ్ మరియు మార్బుల్ స్టోన్, దర్గాలోని సమాధులకు సుమారు మూడు లక్షల రూపాయలతో మక్రాన రాయితో ఖద్దరుల నిర్మాణం చేసినారు. దర్గా ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో రామగుండంకు చెందిన హాజీ బాబర్ సలీం పాషా దర్గా చుట్టు స్లాబ్ మరియు మార్బుల్ స్టోన్ నిర్మాణం చేసినారు. దర్గా లోపల బయట అద్దాలు అమర్చినారు. సుమారు మూడున్నర లక్షలతో దర్గా పైన సిమెంట్ పని చేయించినారు. హైదరాబాద్ కు చెందిన మిర్జా జహంగీర్ బేగ్ అనే భక్తుడు దర్గా లోపల సుమారు లక్ష రూపాయలతో జూమర్ లైటింగ్ అమర్చినారు. భక్తుల త్రాగునీరు సౌకర్యం కొరకు మంచెరియాల్ కు చెందిన నల్ల శంకర్ అనే భక్తుడు బోర్ వేల్ మరియు మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేసినారు. బెల్లంపల్లి కు చెందిన టి శ్రీనివాస్ అనే భక్తుడు హజ్రత్ ముర్తుజాషావలి దర్గా లోపల అద్దాలు అమర్చినారు. హజ్రత్ ఆమీనా బీబీ దర్గా చుట్టూ,హజ్రత్ అఫ్జల్ బీ దర్గా చుట్టూ సుమారు రెండు లక్షల రూపాయలతో రేకుల షెడ్డు ఏర్పాటు చేసినారు. కొత్తగూడెంకు చెందిన గాజి గోవర్ధన్ ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు గత 17 సంవత్సరాల నుండి అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కొత్తగూడెంకు చెందిన కీర్తిశేషులు శ్రీ గాజీ గోవర్ధన్ గారి మిత్ర బృందం దర్గా పైన సుమారు లక్షా డెబ్బై వేల రూపాయలతో సిమెంట్ డిజైనింగ్ పనిచేయించినారు. హనుమకొండకు చెందిన మహమ్మద్ అలీ ముర్తుజా(×ధూ= ణవజ్ =వ్ఱతీవస జుఎజూశ్రీశీఎవవ)అనే భక్తుడు హజ్రత్ ఆమీన బీబీ దర్గా మరియు హజ్రత్ అఫ్జల్ బి దర్గా ముస్లిం మహిళలు ప్రార్థన చేయుటకు మహిళా మస్జిద్ కు సుమారు 9 లక్షలతో మరమ్మతులు, పిఓపి పనులు, స్లాబ్ నిర్మాణం పనులు చేయించినారు. హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ అస్లాం అనే భక్తుడు సుమారు యాభై వేల రూపాయలతో ఎలక్ట్రిక్ వైరింగ్ పనులు చేయించినారు. కొత్తగూడెం కు చెందిన సతీష్,రాజు వారి మిత్రబృందం దర్గా వద్ద భక్తుల సౌకర్యార్థం రెండు గదులకు ప్లాస్టరింగ్ పని,రేకుల షెడ్డు,మంచినీటి ట్యాంక్ నిర్మాణం పని చేసినారు.

**ప్రభుత్వం తరపున పలు నిర్మాణాలు:**1996లో అప్పటి హనుమకొండ ఎంపీ కమాలుద్దీన్ అహ్మద్ గెస్ట్ హౌస్ నిర్మాణం,2001లో జమ్మికుంట మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అంకుషావలి దర్గా ముందు సిసి రోడ్డు, మంచినీటి బావి నిర్మాణం పని పూర్తి చేశారు. అప్పటి హనుమకొండ ఎంపీ చాడా సురేష్ రెడ్డి లక్ష రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం పని పూర్తి చేశారు. అలాగే 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి హుజురాబాద్ శాసనసభ్యులు ఈటెల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉర్స్ ఉత్సవాలలో హాజరై దర్గాను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు దర్గా వద్ద నాలుగు బోర్ వెల్స్, పర్యాటక శాఖ నిధులతో 25 లక్షల రూపాయలతో 12 రూముల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు, వాణఖీ నిధులతో 8 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణం,ఐదు లక్షల రూపాయలతో జామే మస్జిద్ నిర్మాణం, పదిహేడు లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం,ఎనిమిది లక్షలతో కబేళ నిర్మాణ పనులు పూర్తి చేశారు. బిజిగిర్ షరీఫ్ దర్గా చరిత్రను దశదిశాల చాటుతూ దర్గాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం కొరకు అప్పటి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు,రైల్వే పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు.

**ఉర్సు ఉత్సవాలు:-**ఇస్లామిక్ సంవత్సరాదిలో చివరి మాసం అయిన జిల్ హజ్ మాసంలో పదవ తేదిన అనగా బక్రీద్ పర్వదినాన సాయంత్రం గుసుల్ షరీఫ్ కార్యక్రమం నిర్వహిస్తారు. దర్గా ముతావళి మహ్మద్. అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో జరిగే చాదర్ గుల్ కార్యక్రమంలో దర్గా ముజావర్లు హైదబాద్ నుండి తెచ్చిన చాదర్లు సమాధులను అలంకరిస్తారు. బక్రీద్ పండుగ రాత్రి ముఖ్య ఘట్టమైన సంధల్ షరీఫ్(గ్రంథలేపనం)ను మొల్లపల్లె మరియు పెద్ద బిజిగిర్ షరీఫ్ గ్రామాల నుండి ఉత్సాహ పూరిత వాతావరణంలో భక్తులు మేళతాళాల మధ్య సంధల్ షరీఫ్ ను ఊరేగింపుగా దర్గాకు తీసుకొవచ్చి సమాధులకు అలరింపజేస్తారు. అనంతరం ఫాతేహాఖాని, ప్రార్థనలు చేస్తారు. ఉర్స్ సందర్భంగా మహ్మద్ ప్రవక్త ఉపదేశాలను ఆలపిస్తూ ఖవ్వాలి సమ్మేళనాలు జరుపుతారు. దర్గాను, మీనార్లు,చారిత్రాత్మక కట్టడాలకు రంగులు వేయిస్తారు. దర్గాను రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరిస్తారు. భక్తులకు దర్గా ముతవల్లి మొహమ్మద్ అక్బర్ అలీ,దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం,దర్గా కమిటీ కార్యనిర్వహణ అధ్యక్షుడు తౌఫిక్ హుస్సేన్,దర్గా కమిటీ కార్యదర్శి మొహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీణసంయుక్త కార్యదర్శి నయిముద్దీన్,షాహుస్సేన్, సర్వర్,మసూద్ దర్గా కమిటీ సభ్యులు సర్వర్,జలీల్,అహ్మద్, అక్రమ్,తాజ్ తదితరులు సేవలు అందిస్తారు.

# బేగంపేటలో సీసీ కెమెరాల ప్రారంభం



**రాయపోల్, మార్చి 2:** మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో సోమవారం నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మద్ద గీత ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ సిఐ రవికుమార్ హాజరై సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించేందుకు, దొంగతనాలు అరికట్టేందుకు ఇవి సహాయపడతాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని సూచించారు. గ్రామ భద్రత కోసం సర్పంచ్ గీత ప్రవీణ్ తీసుకున్న ఈ చర్య అభినందనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ఎస్సై మహిపాల్ రెడ్డి,ఉప సర్పంచ్ మంకిడి స్వామి,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, యువకులు,ప్రజలు పాల్గొన్నారు.

# దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఘన నివాళులు

- చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన-డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట, మార్చి,02-03(సమయం న్యూస్) :** సోమవారం నారాయణపేట జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీఎస్పీ నల్లపు లింగయ్య ఆధ్వర్యంలో స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జయంతి కార్యక్రమాలలో భాగంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ... దుద్దిళ్ల శ్రీపాదరావు సౌమ్య మనస్తత్వం గల నాయకుడిగా ప్రజల మధ్యనే ఉంటూ వారి కష్టనష్టాల్లో భాగస్వామ్యులై ప్రజానాయకునిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. స్పీకర్‌గా పనిచేసిన సమయంలో ఆయన నిజాయితీ, నిరాడంబరత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ విజయ్ భాస్కర్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ లాల్, ఎస్సైలు పురుషోత్తం, ఆర్ ఎస్సై శ్వేత, జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 21 ఫిర్యాదులు

- ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ
- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి



**నారాయణపేట, మార్చి,0203(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలనీ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణింధర్ రెడ్డి,అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మున్సిపల్ చైర్ పర్సన్ ను సన్మానించినయాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి .



**తాండూరు మున్సిపల్, మార్చి,0203(సమయం న్యూస్) :** తాండూరు మున్సిపల్ ఛైర్పర్సన్ బాధ్యతలు స్వికరించిన సందర్భంగా నీరజ బాల్ రెడ్డికి సన్మానించి శుభాకాంక్షలు తెలియచేసిన యాలాల మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి, యాలాల గ్రామ సర్పంచ్ సి. హెచ్ శివయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య,నర్సిములు, పేరి మధుసూదన్ రెడ్డి, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు

## తాండూరు మున్సిపల్ చైర్పర్సన్ గా పదవి బాధ్యతలు

- చేపట్టిన పట్లోళ్ల నీరాజబాల్ రెడ్డి
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి





**తాండూరు, మున్సిపల్, మార్చి,0203(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గా ఎన్నికైన పట్లోళ్ల నీరజాబాల్ రెడ్డి సోమవారం అట హసంగా పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పట్టణ అభివృద్ధి చేపట్టాలని ఆయన కౌన్సిలర్లకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పేరు ఎత్తకుండా ఘటన విమర్శలు సంధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పి. నీరజబాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

## మార్చి 4న హోలీ, 19న ఉగాది, 27న శ్రీరామ నవమి

- పటాన్ చెరులో పండుగల తేదీలపై పుర ప్రముఖుల సమావేశంలో నిర్ణయం



**పటాన్ చెరు, మార్చి 2 (సమయం న్యూస్):**మార్చి 4న హోలీ, మార్చి 19న ఉగాది, మార్చి 27న శ్రీరామ నవమి పర్వదినాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలనిపటాన్ చెరు పట్టణంలో పుర ప్రముఖుల సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అధ్యక్షతన పుర ప్రముఖుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పండుగల నిర్వహణ, ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ వేద పండితుల సూచనలకు అనుగుణంగా నిర్ణయించిన తేదీలలో పట్టణ ప్రజలు భక్తి భావంతో పండుగలను నిర్వహించుకోవాలని కోరారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా ఐదు రోజులపాటు బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి,యువ నాయకుడు మాదిరి పృథ్వీరాజ్, వివిధ కుల సంఘాల అధ్యక్షులు, పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలల హెడ్మాస్టర్ లను సూపర్వైజర్లుగా నియమించాలి



**పరిగి మున్సిపల్,(మం)మార్చి,02 (సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం మే నెల 11 తేదీ నుండి జూన్ నెల పదవ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జనగణన హౌస్ లిస్టింగ్ సర్వేలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను సూపర్వైజర్లుగా విధులు కేటాయించాలని పరిగి తహసిల్దార్ ఎమ్ వెంకటేశ్వరి కి ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల రాష్ట్ర అసోసియేషన్ సంఘం జిల్లా అధ్యక్షులు సి రామాంజనేయులు,రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఉస్మాన్ అలీ ఆధ్వర్యంలో మెమో రాండం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా పి ఆర్ టి యు మండల అధ్యక్షులు డి బుగ్గయ్య, ప్రధాన కార్యదర్శి వి రాకేష్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యారంగంలో 25 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్నారని . సీనియర్లుగా పని చేస్తున్న వీరికి సూపర్వైజర్లుగా తప్పక విధులు కేటాయించాలని తెలియజేశారుఇట్టి కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సి మొగులయ్య, బసవరాజ్, అంజలయ్య,, వై వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం ఆర్ డి ఓ గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



**ఖమ్మం మార్చి 2 : ( సమయం న్యూస్ ) :** ఇటీవల వెలుగుమట్ల భూదాన భూముల అంశంలో పేదల గుడిసెల కూల్చివేత అంశం రాష్ట్రస్థాయిలో సంచలనం కలిగించిన నేపథ్యంలో హఠాత్తుగా బదిలీ కాబడ్డ నరసింహారావు స్తానంలో సోమవారం నూతన ఆర్డీవో గా ఎన్. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్దురిశెట్టి ను కలుసుకొని , పూల మొక్కను అందజేశారు.

# సహజసిద్ధమైన రంగులతో హోళీ సంబరాలు జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- హోళీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులను కలిగించకుండా జరుపుకోవాలి
- బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు
- ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**కొత్తగూడెం మార్చి2( సమయం న్యూస్). :** హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుభాకాంక్షలు తెలిపుతూ హోలీ పండుగను సాంప్రదాయబద్ధంగా ,పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని జిల్లా ప్రజలను కోరారు. హోలీ వేడుకల సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాలు,ప్రజా ప్రదేశాలు,రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందుకోసం షీ టీమ్ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రధాన కూడళ్లలో మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిఘా బృందాలను ఏర్పాటు చేస్తునట్లు తెలిపారు. పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని,జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ పరస్పర గౌరవంతో,సురక్షితంగా హోలీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

# శిశు సంరక్షణకు ప్రాధాన్యం

- వయోవృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- మహిళా ప్రాంగణంలోని శిశు గృహం, ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, మార్చి 02( సమయం న్యూస్). :** జిల్లాలో చిన్నారుల సంరక్షణ, దత్తత ప్రక్రియ వేగవంతం చేయడం మరియు వయోవృద్ధుల సంక్షేమ సేవలను మరింత మెరుగుపరచడం లక్ష్యంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సోమవారం మహిళా ప్రాంగణంలోని శిశు గృహ కేంద్రం మరియు ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, సేవలపై ఆరా తీసి, వృద్ధులకు అందుతున్న సదుపాయాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.

శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న పోషకాహారం (ఫీడింగ్), వైద్య సేవలు తదితర అంశాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల దత్తత ప్రక్రియపై విచారణ చేయగా, దత్తత ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోందని జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. శిశు గృహం ద్వారా చిన్నారులకు మంచి ఆరోగ్య సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనిఅధికారులకు సూచించారు. చిన్నారుల అవసరాలకు సంబంధించిన ఏవైనా అంశాలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం అక్కడే నిర్వహిస్తున్న వయోవృద్ధుల డే కేర్ (ప్రణామ్) సెంటర్‌ను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా వయోవృద్ధులకు అందుతున్న సేవలపై అక్కడున్న వృద్ధులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారు ఎప్పటి నుంచి కేంద్రానికి వస్తున్నారు, ఏర్పాట్లు ఎలా ఉన్నాయి, రోజువారీ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. వృద్ధులు మాట్లాడుతూ, డే కేర్ సెంటర్‌లో క్యారం, చెస్, పత్రికలు, టీవీ వంటి సదుపాయాలు ఉండటంతో సంతోషంగా సమయం గడుపుతున్నామని, భోజనానికి ఇంటికి వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారు ఆహ్లాదకరంగా సమయం గడపడానికి డే కేర్ ప్రణామ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వృద్ధులు ఈ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డే కేర్ సెంటర్‌లోని మెంబర్షిప్ రిజిస్టర్, విజిటర్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. సెంటర్‌ను సందర్శించే వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా డే కేర్ సెంటర్‌లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలని, మరింత మెరుగైన సేవలు అందించాలని, ఫిజియోథెరపీ సామగ్రి అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, డిసిపి రత్నం, మేనేజర్ మొగులయ్య, సఖి సీఏ కల్పన, డే కేర్ సిబ్బంది దీప, జయశ్రీ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాచార కార్యాలయం, సంగారెడ్డి

# హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలి

- హోలీ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు.
- లోతట్టు ప్రదేశాల్లో స్నానాల సమయంలో యువత జాగ్రత్తలు పాటించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.



**నారాయణపేట, మార్చి,0203(సమయం న్యూస్ :** నారాయణపేట జిల్లా: హోలీ పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో, సాంప్రదాయ పద్ధతుల్లో, సహజ సిద్ధమైన రంగులతో జరుపుకోవాలని సూచించారు. హోలీ పండుగతో పాటు రంజాన్ మాసం కూడా కొనసాగుతున్నందున మతసామరస్యాన్ని కాపాడుతూ పరస్పర గౌరవంతో పండుగలు నిర్వహించుకోవాలని తెలిపారు. మత పెద్దలతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అతివేగం, రష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలను పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రధాన చౌరస్తాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడంతో పాటు ముఖ్య ప్రదేశాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై లేదా బహిరంగ ప్రదేశాల్లో బలవంతంగా రంగులు, రంగు నీళ్లు చల్లకూడదని స్పష్టం చేశారు. బైకులు, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు భంగం కలిగించవద్దని హెచ్చరించారు. హోలీ అనంతరం చెరువులు, కుంటలు, లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు చేసే సమయంలో యువత తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే అక్కడ కూడా బందోబస్తు ఏర్పాటు చేయా లని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కార్యకలాపాలను గమనిస్తూ వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజలంతా శాంతియుతంగా, భద్రంగా హోలీ పండుగను జరుపుకుని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# పువ్వాడ ఉదయ్ నగర్ లో డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలి

- పువ్వాడ నగర్ఎస్సీ బీసీ కాలనీ లోని పేద ప్రజలకు న్యాయం చేయాలి
- ఖాళీప్లాటుకు ఇంటి నెంబర్ కేటాయించిన అధికారులపై చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వ భూమిని ప్రైవేట్ భూమిగా చూపిస్తూ
- నోటీస్ పంపిన మహిళ అంశంలో దర్యాప్తు చేయాలి
- జిల్లా కలెక్టర్ కు వీర నారీమణుల ఆశయ సాధన సమితి వినతి



**ఖమ్మం , మార్చి 2 : ( సమయం న్యూస్ ) :** జిల్లా కేంద్రమైన ఖమ్మం కు సమీపంలో గల రఘునాధపాలెం మండలంలోని పువ్వ ల ఉదయ్ నగర్ లో జన వాసానికి కూత వేటు దూరంలో నిర్మాణం చేస్తున్న డంపింగ్ యార్డ్ ను ఇక్కడ నుండి ఎత్తివే యాలని , సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని , అదేవిధంగా పువ్వాడఉదయ నగర్ లోని ఎస్సీ బీసీ కాలనీ లోని పేద ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలపై దృష్టి సారించి , పరిష్కరించాలని వీర నారీ మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె పువ్వాడ ఉదయ నగర్ బాధితుల మహిళలతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామ ప్రజల ఆమోదం , తీర్మానం లేకుండా స్థానికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేసే డంపింగ్ యార్డ్ నిర్మాణం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని , ప్రస్తుత నిర్మాణ స్థలం నుండిసుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో నిర్మించాలని కోరారు. వడ ఉదయ నగర్ లో గల ఎస్సీ బీసీ కాలనీలలో ఇందిరమ్మ గృహం పేరుతో కొంతమందికి కోయ చలక రెవెన్యూ పరిధిలో గల 19 2 సర్వే లో ఇందిరమ్మ గృహాలు ఇవ్వగా మరి కొంతమందికి రెండవ విడత కు పరిమితి విధించారు. గృహాలు పొందిన వారికి రేషన్ కార్డులు ,ఇంటి పన్ను లు , కరెంట్ మీటరు , ధ్రువీకరణ పత్రాలు అందజేశారని తెలిపారు. ఇలా ఉన్న నేపథ్యంలో రత్నకుమారి అనే మహిళ ఈ సర్వే పరిధిలో తన ప్రైవేట్ భూమి ఉందని , ఇది ప్రభుత్వ భూమి కాదని పేర్కొంటూ సదరు ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని నివసిస్తున్న వారికి నోటీసులు పంపిందని తెలిపారు. ఆమె పేర్కొంటున్న సదరు ఖాళీ స్థలం , ప్రభుత్వ భూమి కాగా పంచాయతీ అధికారులు ముఖ్యంగా కార్యదర్శి ఆ ఖాళీ స్థలం లో ఇల్లు ఉంటున్నట్లు ఇంటి నెంబర్ను ఇవ్వడం జరిగిందని చెప్పారు. కోర్టు నుండి నోటీసులు జారీ చేయడంతో పేద ప్రజలు ఆందోళన చెందుతున్నారని వారికి తగిన న్యాయం చేయాలని వినతి పత్రంలో వెల్లడించారు. అదేవిధంగా అతను ఖాళీ స్థలం కు ఇంటి నెంబర్ కేటాయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని , సదరు రత్నకుమారి అనే మహిళ పేర్కొన్న అంశం పై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సదరు రత్నకుమారి విషయంపైపోలీస్ కమిషనర్ కు కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఈ భూమి విషయంలోహొహొరఘునాధ పాలెం పోలీసులు సదరు రత్నాకుమారిని మహిళ వైపు నుంచి బాధిత మహిళలతో బెదిరింపు ధోరణితో మాట్లాడటం చేస్తున్నారని , సివిల్ కేసుల్లో పోలీసుల జోక్యం తగదని , కోర్టు పరిధిలో కేసు ఉండగా పోలీసులు అనవసరంగా ఈ అంశంలో తల దూర్చడం చట్టాన్ని అతిక్రమించడమేనని సి పి కు వివరంగా ఫిర్యాదు చేసామన్నారు. సదరు పోలీసులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరమన్నారు. త్వరితగతంగాసంబంధిత అధికారులతో సహా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి , సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీరనారీమణుల ఆశయ సాధన సమితి నాయకులు జ్యోతి ,స్పందన, నాగమణి, ప్రమీల, ఝాన్సీ ,విజయ ,బాధితులు భాగ్యమ్మ , సుభద్ర ,రంగమ్మ ,అలివేలు, మంగమ్మ, నాగేంద్ర ,సరోజినీ పాల్గొన్నారు

# సమిష్టి సహకారంతో ఆదర్శ మున్సిపాలిటీగా ఇస్నాపూర్

- తొలి పాలకవర్గ సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపు
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు




**పటాన్ చెరు, మార్చి 2 (సమయం న్యూస్):** నూతనంగా ఏర్పడిన ఇస్నాపూర్ మున్సిపాలిటీని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సమిష్టి సహకారంతో రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లక్డారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ సుమలత అధ్యక్షతన నిర్వహించిన పురపాలిక తొలి పాలకవర్గ సమావేశానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గంలో నూతనంగా ఐదు మున్సిపాలిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 15 కోట్ల చొప్పున నిధులు కేటాయించామని, వార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా రాబోయే ఐదు సంవత్సరాలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవి రెడ్డి, కమిషనర్ వెంకట కిషన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నేటి యువతకు ఆదర్శ వంతుడు స్వామి వివేకానంద

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



మద్దూరు మున్సిపల్, మార్చి,02(సమయం న్యూస్)

మద్దూర్ పట్టణ కేంద్రంలో సోమవారం రోజు ప్రభుత్వ మరియు ప్రైవేట్ పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ చేసిన ఏబీవీపీ మరియు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు. వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు హిందూ ధర్మం అంశాలపై అవగాహన మరియు భగవద్గీత శ్లోకాల కంఠస్థంలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా రవీంద్రనాథ్ హాజరై మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందను అభిమానిగా ఎన్నుకోవాలని సూచించారు. చికాగోలో ఏర్పాటు చేసిన వివిధ మత పెద్దల సమావేశంలో హిందూ ధర్మం పై సంక్షిప్తంగా మాట్లాడిన మహా యోధుడు స్వామి వివేకానంద అని తెలిపారు. నేటి సమాజంలో యువతకు ఆదర్శంగా నిలిచే హిందూ ధర్మకర్త స్వామి వివేకానంద అని అన్నారు. గురువు లేని విద్య...గుడ్డి విద్య అని సామెతను గుర్తు చేశారు. విద్యార్థినీ విద్యార్థులు తప్పకుండా ప్రతి ఒక్కరూ మనం పూజించే దేవుడితోపాటు తల్లిదండ్రులు మరియు గురువు కూడా ప్రముఖులని గుర్తు చేశారు. భగవద్గీతలో ఉండే ధర్మం మనిషి జీవితంలో జరిగే విశాలపై క్రమశిక్షణ నేర్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏబీపీ కన్వీనర్ నరేష్, ఎస్సై విజయ్ కుమార్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు దినేష్, నర్సింలు, సంగీత శివకుమార్, గోపాల్, మౌలానా, లింగా నాయక్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వేణుగోపాల్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు కాలప్ప, సాయప్ప, ఏబీపీ నాయకులు, శ్రీహరి శ్రీను శివ ప్రశాంత్ పురుషోత్తం మహేష్ శివ, సూర్యకిరణ్, నిఖిల్ ,బిజెపి నాయకులు సాయిలు ,భరత్ కుమార్, రఘు, కాశప్ప హరీష్, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# దోమడుగు జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు వీఆర్ పరికరాలు, ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ



**పటాన్ చెరు (గుమ్మడిదల), మార్చి 2 (సమయం న్యూస్):**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని దోమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 9వ వార్డు కౌన్సిలర్ మద్ది సోనీ శేఖర్ రెడ్డి తన సొంత నిధులతో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు వర్చువల్ రియాలిటీ (వీఆర్ హెడ్‌సెట్) పరికరాలు మరియు ఎగ్జామ్ ప్యాడ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తరగతి వారీగా పాఠ్యాంశాలను వీఆర్ సాంకేతికత ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. 6వ తరగతి విద్యార్థులకు వేర్ల రకాలు, నిర్మాణం--విధులు, 7వ తరగతికి మొక్కల లైంగిక ప్రత్యుత్పత్తి అవయవాలు, 8వ తరగతికి సౌర వ్యవస్థ పరిచయం, 9వ తరగతికి మానవ కన్ను నిర్మాణం, 10వ తరగతికి మానవ విసర్జన వ్యవస్థ అంశాలను ప్రత్యక్ష అనుభూతితో వివరించారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడం ద్వారా చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామీణ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అభిశెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజు రెడ్డి, బ్యాగరి వరలక్ష్మి కృష్ణ, నాయకులు మురళి, మద్ది రామ్ రెడ్డి, బోర శ్రీనివాస్ రెడ్డి, మద్ది ప్రవీణ్ రెడ్డి, మద్ది శ్రీనివాస్ రెడ్డి, శ్యామల నవీన్ రెడ్డి, శ్యామల అనిల్ రెడ్డి, దిలీప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,పాల్గొన్నారు.

# అధైర్య పడకండి.. అండగా ఉంటాను


- ఎమ్మెల్యే జిఎంఆర్
- బంధంకొమ్ము రహదారి విస్తరణ పనుల పరిశీలన
- ఇల్లు యజమానులు నష్టపోకుండా సరికొత్త ప్రణాళిక



**పటాన్ చెరు, మార్చి 2 (సమయం న్యూస్):** చందానగర్ జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్, బంధంకొమ్ము మీదుగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గాంధీ విగ్రహం వరకు చేపడుతున్న 150 అడుగుల రహదారి విస్తరణ పనుల వల్ల నష్టపోతున్న భూమి, ఇళ్ల యజమానులు అధైర్య పడవద్దని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. వారికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని తెలిపారు. సోమవారం ఉదయం బంధంకొమ్ము రహదారి విస్తరణ పనులపై అన్ని శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రహదారి పక్కనే చెరువు ఉండటంతో ఒకే వైపు 150 అడుగుల విస్తరణ చేపడితే ఇళ్ల యజమానులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ నేపథ్యంలో చెరువు సమీపంలో రహదారికి సమాంతరంగా బ్రిడ్జి నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సంబంధిత అధికారులకు సూచించారు. అధికారులు ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని తెలిపారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లి ఇళ్ల యజమానులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఎమ్మార్వో వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట నిర్వహిస్తున్న నలుగురు అరెస్ట్ నగదు, వాహనాలు స్వాధీనం

- మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్.
- అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం-ఎస్సై



**కొత్తపల్లి మండలం, మార్చి,02(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి మండలం కొత్తపల్లి గ్రామ పరిధిలో అక్రమంగా పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టాస్క్ ఫోర్స్, మద్దూర్ పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు:రూ. 5,400/- నగదు 52 ప్లేయింగ్ కార్డులు 2 మొబైల్ ఫోన్లు 2 మోటార్ సైకిళ్లు మరియు నలుగురుని పట్టుకొని వారి పై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఇలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఎస్సై తెలిపారు.

# ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- ముఖ్య అతిథులుగా గూడెం యాదమ్మ, గూడెం కల్పన,మాద్రి తులసి, మాద్రి మానస పాల్గొన్నారు



**పటాన్ చెరు, మార్చి 2 (సమయం న్యూస్):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతో ఉందని పటాన్ చెరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని వాసవి ఫంక్షన్ హాలులో సోమవారం ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మరియు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దశాబ్దం క్రితం వరకు మహిళలు గృహ కార్యకలాపాలకే పరిమితమయ్యారని, నేడు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని అన్నారు. మహిళలకు సమాన అవకాశాలు లభిస్తున్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్లల విద్యకు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మాద్రి మానస మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, విద్య, ఉపాధి మరియు స్వయంసాధన ద్వారా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ హారిక విజయ్ కుమార్, స్వప్న, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండో వార్డు తెలంగ్ వాడి బొడ్రాయి దగ్గర అండర్ డ్రైన్ వర్క్ పనులు ప్రారంభం

● ప్రారంభించిన రెండో వార్డు కౌన్సిలర్ ఆర్.వాణిశ్రీ మధుసుధన్ యాదవ్



**కొడంగల్ మున్సిపల్, మార్చి,02(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు తెలంగ్ వాడి బొడ్రాయి దగ్గర అండర్ డ్రైన్ పనులను ప్రారంభం చేసిన మున్సిపల్ రెండవ వార్డ్ కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్, కాంట్రాక్టర్ కు గుంటలు దోవ్వి త్వరగా పైప్లైన్ కంప్లీట్ చేసి గుంతలు పూడ్చేయాలని పనులు త్వరగా జరగాలని చెప్పారు. కౌన్సిలర్ ఆర్ వాణి శ్రీ మధుసూదన్ యాదవ్ కంసాన్పల్లి కిష్టప్ప, బంగారం బాలు,చింతకాయల శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## హుసేన్ పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

● ఘనంగా జరుపుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ అంజిలయ్య...

● టివివి రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్,ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్,ఎంపీవో జైపాల్ రెడ్డి

● ప్రధాన ఉపాధ్యాయుడు ఇల్లూరీ క్రాంతి కుమార్ అధ్యక్షతన..



**కొడంగల్ మండలం, మార్చి 02(సమయం న్యూస్) :** కొడంగల్ మండలం లోని హుసేన్ పూర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు ఇల్లూరి క్రాంతికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంజిలయ్య , టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఎంపీవో జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షించాయి.ఈ కార్యక్రమంలో టీఎస్జీవోస్ తాలూకా అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శి కె. కొండన్న, డివిడ్, సీనియర్ ఉపాధ్యాయులు ఎఫ్. నర్సిములు, సంగమేశ్, హనుమంతు, గోపాల్ రెడ్డి, సీఆర్పీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఇందిరమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ మమత, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇల్లూరి క్రాంతికుమార్,ఉపాధ్యాయురాలు సంధ్య విద్యార్థులను చదువుల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయం అని అన్నారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చేవెళ్ల ఆర్డిఓ పార్ధ సింహ రెడ్డి

-చేవెళ్ల నూతన ఆర్డీవో పార్థసింహారెడ్డిని కలిసి బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ జాతీయ నాయకులు పాలమాకుల జంగయ్య



**చేవెళ్ల మార్చ్:02 (సమయం న్యూస్) :** చేవెళ్ల నూతన ఆర్డిఓ గా వచ్చిన పార్థసింహారెడ్డిని ఈరోజు సిపిఐ పార్టీ నాయకులు కలిసి పూల బొక్కటను ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు కలిసిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె రామస్వామి జిల్లా కార్యవర్గ సభ్యులు భారతరాజు నరసింహ సిపిఐ జిల్లా సమితి సభ్యులు దత్తు నాయక్ కే చంద్ర యాదవ్ సక్రు నాయక్ మంజుల ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ గిరిజన రైతులు శంకర్ నాయక్ వెంకటేష్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆర్డీవో దృష్టికి మోకిలా గ్రామానికి చెందిన రైతుల సమస్యను ఆర్డీవో గారికి వివరించారు పొన్నగట్టు తాండ రైతులకు ఐదు ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నది ప్రభుత్వం ల్యాండ్ పోలింగ్ ద్వారా ఆ ల్యాండ్ ను తీసుకున్నది ఎకరాకు 800 గజాల తరఫున ఐదు ఎకరాలకు 4000 గజాలు గిరిజన రైతులకు రావాలి కానీ వీరికి ఇవ్వకుండా బోగస్ పేర్లను చేర్చి గిరిజన రైతులకు అన్యాయం చేయాలని చూసిన అధికారులపై మరియు దొంగ పేర్లు ఉన్న వారిపై చర్యలు తీసుకొని నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.

# వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో ఘనంగా 34 వ వార్షికోత్సవ వేడుకలు

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమంగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప

● వివేకా విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు,అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తూన్నారు-సివిల్ జడ్జ్




**అమనగల్,మార్చి,02-03(సమయం న్యూస్) :** స్థానిక ఆమనగల్ పట్టణంలోని వివేక విద్యా భారతి ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాపించి 34 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాఠశాల ఆవరణలో వార్షికోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జ్ కాటం స్వరూప హాజరయ్యారు. వీరితోపాటు సీనియర్ ఉ మెన్స్ ఎన్. సీ. సీ ఇన్స్ట్రక్టర్ సరోజ బాల ఠాగూర్,శృతిలయా కల్చర్ అకాడమీ చెర్మెన్ చిత్తరాంజన్ దాస్, డాక్టర్ బి పుల్లయ్య కూడా హాజరయ్యారు. మెజిస్ట్రేట్ కాటమ్ స్వరూప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ వివేక విద్యా భారతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలలో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అన్ని రంగాలలో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. గతంలో ఇదే పాఠశాలలో చదివి వివిధ ఉన్నత స్థాయిలలో రాణిస్తున్న విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. సాధారణ బడ్జెట్ పాఠశాల స్థాయిలో ఉండి కూడా కార్పొరేట్ పాఠశాలలను మించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. మండల స్థాయి, జిల్లాస్థాయి మరియు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు ప్రిన్సిపాల్ మహమూద్,ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలు

- సుమారు 250 మంది కార్మికులతో భద్రతా ర్యాలీ




**పటాన్ చెరు(జిన్నారం), మార్చి 2 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం, కాజిపల్లి పారిశ్రామిక వాడలో జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భద్రతా అవగాహన ర్యాలీ ఘనంగా జరిగింది. పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సహా సుమారు 250 మంది కార్మికులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.పరిశ్రమల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతమైంది.పరిశ్రమల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన పనివాతావరణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగుల్లో భద్రతా ప్రమాణాలపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచనలు, సందేశాలు అందించారు.కార్యాలయ భద్రత పట్ల వారి నిబద్ధతను నిర్వాహకులు అభినందించారు.ఈ సందర్భంగా జాతీయ భద్రతా దినోత్సవం థీమ్ "భద్రత పెంపొందించడానికి పాల్గొనండి, అవగాహన కల్పించండి మరియు సాధికారత కల్పించండి" పట్ల అందరి సమిష్టి కట్టుబాటు స్పష్టమైందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకాలు అందించిన డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వై. మోహన్ బాబుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రోత్సాహం మరియు మద్దతు అందించిన డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి. నెహ్రూకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ర్యాలీ నిర్వహణలో ఆపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, మాట్రిక్స్ ఫార్మాకార్ప్ (యూనిట్--1, 2), ఆర్డిపిఎల్, విరూపాక్ష ఆర్గానిక్స్, న్యూల్యాండ్ లాబరేటరీ, లీ ఫార్మా సంస్థల యాజమాన్య బృందాలు సహకారం అందించాయి. కార్యక్రమం ముగింపులో పరిశ్రమల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేసి, కార్యాలయాల్లో ప్రమాదాల నివారణ లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# శివాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఆలయ ప్రాంగణంలో గదుల నిర్మాణం

- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం



**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 2 (సమయం న్యూస్ ):** జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని శివాలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ స్వప్న రాజేందర్ రెడ్డి సహా గ్రామస్తులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ అభివృద్ధి, గ్రామ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా శివాలయంలో పంతులుల నివాస గదులు నిర్మించడంతో పాటు స్వాముల దీక్షల కోసం ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.గ్రామంలోని సర్వే నంబర్--1 భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా ఈ నెల 5న జిన్నారంలో నూతనంగా నిర్మించిన పాఠశాల గదులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. పెద్దమ్మగూడెం పానాది రోడ్డుకు మరమ్మతులు చేపట్టడం, పాఠశాల ప్రాంగణంలో మొరం వేయడం వంటి పనులను వెంటనే పూర్తి చేయాలని వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ చారి, గాండ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, మహేందర్ గౌడ్, బాలుచారి, సందీప్ రెడ్డి, బుక్క శ్రీకాంత్, రాజు గౌడ్, అశోక్ చారి, జిన్నారం రాము, ఫోటో ప్రభాకర్, నీలం వెంకటేష్, రాము, ఫణి భూషణ్, వేణురెడ్డి, నీలం విక్కి, చంద్రా రెడ్డి, సాయి, పుట్టి మధు, కిషోర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# హోలీ స్పిరిట్ స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి






## విద్యార్థులకు బహుమతులు అందజేత

**చేవెళ్ల మార్చ్02:( సమయం న్యూస్)** శ్రీ షాబాద్ మండల కేంద్రంలోని హోలీ స్పిరిట్ స్కూల్ వార్షికోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ రంగాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసిన రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలగంటి మధుసూదన్ రెడ్డి. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఒక ఐఏఎస్ ఐపీఎస్ ఒక డాక్టర్ ఇలా ఒక గోల్ ఏర్పరచుకొని చదువు కొనసాగించాలని విద్యార్థులకు చెప్పారు. గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కాంతరెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్ ,సర్పంచులు అశోక్ ,ప్రభాకర్ రెడ్డి ,యాదయ్య ,సందీప్, శ్రీశైలం ,నాయకులు జనార్ధన్ రెడ్డి, కిషోర్ ,విష్ణువర్ధన్ రెడ్డి రఫిక్ శ్రీనివాస్ రాహుల్, గౌరీశ్వర్ ,పాఠశాల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.




# చాలాసార్లు చెప్పాను

## బౌలింగ్ ఎక్కడ చేయాలో తెలియదు..

## అల్లుడు షాహీన్‌పై షాహిద్ అఫ్రిదీ ఆగ్రహం

పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిదీ తన అల్లుడు, స్టార్ పేసర్ షాహీన్ షాహ్ అఫ్రిదీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్తాన్ టీమ్ నిరాశపరిచిన ప్రదర్శన, ముఖ్యంగా షాహీన్ బౌలింగ్‌లో పేలవమైన ప్రదర్శణ కారణంగా షాహిద్ అఫ్రిదీ ఈ విధంగా భావోద్వేగంతో మాట్లాడారు. టీవీ షోలో మాట్లాడుతూ, షాహిద్ అఫ్రిదీ షాహీన్ గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "షాహీన్ ఇంత కాలంగా ఆడుతున్నాడు, కానీ అతనికి ఎక్కడ బౌలింగ్ చేయాలో తెలియదు. చివరి ఓవర్లలో ఏ లైన్, లెంగ్త్ ఉపయోగించాలో కూడా అర్థం చేసుకోలేదు. నేను అతనికి చాలాసార్లు చెప్పాను, కానీ అతను మళ్లీ మళ్లీ అదే తప్పులు చేస్తున్నాడు," అని అఫ్రిదీ అన్నారు.

పాకిస్తాన్ సూపర్ ఎయిట్స్ దశలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో షాహీన్ బౌలింగ్ ఎంపికలు, ఫీల్డ్ సెట్టింగ్స్‌పై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. "రైట్ హ్యాండర్ బ్యాట్స్‌మన్ ఆడుతుంటే రౌండ్ ది వికెట్ బౌలింగ్ చేయకూడదు. అలా చేస్తే ఇన్‌సైడ్ వికెట్‌కు టార్గెట్ చేయాలి. థర్డ్ మ్యాన్, పాయింట్ ఫీల్డర్లు అప్‌లో ఉంటే ఆఫ్ స్టంప్ బయట బౌలింగ్ చేస్తే ఆసియా పిచ్‌లపై సులభంగా లాబ్ షాట్లు వస్తాయి," అని వివరించారు. టీ20 వరల్డ్ కప్ నుంచి పాకిస్తాన్ క్విట్ అయిన తర్వాత షాహిద్ అఫ్రిదీ ఈ విధంగా ఆగ్రహంతో మాట్లాడటం గమనార్హం. ఇది షాహీన్ బౌలింగ్‌లో పదేపదే వచ్చిన వైఫల్యాలపై ఆయన అసంతృప్తిని సూచిస్తుంది.

గతంలో కూడా భారత్‌తో జరిగిన మ్యాచ్ ఓటమి తర్వాత షాహీన్‌తో పాటు బాబర్ అజామ్, షదాబ్ ఖాన్‌లను డ్రాప్ చేయాలని అఫ్రిదీ సూచించారు. అయితే, గతంలో ఒకసారి షాహీన్‌ను తన ౘ× నుంచి డ్రాప్ చేసి, అతని ఈగోను దెబ్బతీసి గుస్సా పుట్టించాలని ఉద్దేశపూర్వకంగా చేశానని షాహిద్ అఫ్రిదీ చెప్పారు. అది పనిచేసి షాహీన్ మంచి ప్రదర్శన చూపించాడని కూడా పేర్కొన్నారు. కానీ ఈసారి వరల్డ్ కప్ ఎగ్జిట్ తర్వాత మాత్రం ఆయన ఆగ్రహం మరింత తీవ్రంగా ఉంది. పాకిస్తాన్ క్రికెట్‌లో సీనియర్ ఆటగాళ్ల నిలకడలేని ఆటతీరు, టీమ్ ఓటములు కొనసాగుతున్న నేపథ్యంలో షాహిద్ అఫ్రిదీ వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి.

# శివమ్ దూబే వల్లే గెలిచాం: గంభీర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం కోల్‌కతా వేదికగా జరిగిన డూ ఆర్ డై సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 5 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ (50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 97 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే సంజూ శాంసన్‌తో పాటు మ్యాచ్ చివర్లో శివమ్ దూబే కొట్టిన రెండు బౌండరీలు కూడా భారత విజయంలో కీలక పాత్ర పోషించాయని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అభిప్రాయపడ్డాడు. తీవ్ర ఒత్తిడిలో దూబే ఆ రౌండు బౌండరీ కొట్టకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని చెప్పాడు. భారత విజయంలో సంజూ ఇన్నింగ్స్ ఎంత పాత్ర పోషించిందో.. శివమ్ దూబే బౌండరీలకు అంతే విలువ ఉందని గంభీర్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గంభీర్.. శివమ్ దూబే బ్యాటింగ్‌పై ప్రశంసల జల్లు కురిపించాడు. 'మనం కొన్ని ప్రత్యేకమైన సహకారాల గురించి మాట్లాడుకుందాం. శివం దూబే కొట్టిన ఆ రెండు బౌండరీలు.. సంజూ ఆడిన 97 పరుగుల ఇన్నింగ్స్‌తో సమానమని నేను భావిస్తున్నాను. ఇది ఒక టీమ్ గేమ్. కాబట్టి ఆ రెండు బౌండరీలు సంజూ ఇన్నింగ్స్ అంత కీలకం. ఎందుకంటే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవకపోయి ఉంటే.. సంజూ ఇన్నింగ్స్ గురించి ఎవరూ మాట్లాడుకునేవాళ్లు కాదు.సంజూ శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కానీ జట్టు గెలవడానికి ఇలాంటి చిన్న చిన్న సహకారాలే సహాయపడతాయి. పెద్ద స్కోర్లు హెడ్‌లైన్స్‌లో నిలుస్తాయి, కానీ జట్టు గెలుపు గీత దాటడానికి దోహదపడే ఇలాంటి చిన్న సహకారాలే చాలా కీలకం. నేను హెడ్ కోచ్‌గా ఉన్నంత కాలం ఇదే మా ఫిలాసఫీగా ఉంటుంది.'అని గంభీర్ స్పష్టం చేశాడు.




# 2026 టీ20 ప్రపంచ కప్ నుండి నిష్క్రమణ

# పాకిస్తాన్‌కు మరో ఎదురుదెబ్బ!

### పాకిస్థాన్-బంగ్లాదేశ్ సిరీస్ కష్టాల్లో.. ఈ సిరీస్ ఇప్పుడు రద్దు అయ్యే అవకాశం



**ఢిల్లీ:** పాకిస్తాన్ క్రికెట్ టీమ్ మార్చి 2026లో బంగ్లాదేశ్‌కు వెళ్లి మూడు మ్యాచ్‌ల ఓడీఐ సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఈ సిరీస్ పూర్తిగా అనిశ్చితిలో పడింది. పశ్చిమ ఆసియాలో (మిడిల్ ఈస్ట్) జరుగుతున్న జియోపాలిటికల్ టెన్షన్స్, ఇజ్రాయెల్-ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, ఇతర దేశాల (దుబాయ్, సౌదీ అరేబియా వంటివి) ప్రమేయం కారణంగా పాకిస్తాన్ టీమ్ బంగ్లాదేశ్‌కు ట్రావెల్ చేయడం ప్రమాదకరంగా మారింది. సిరీస్ షెడ్యూల్ ప్రకారం పాకిస్తాన్ టీమ్ మార్చి 9న ఢాకాకు చేరుకోవాలి. మూడు ఓడీఐ మ్యాచ్‌లు.. మార్చి 11, 13, 15 తేదీల్లో షేర్-ఎ-బంగ్లా నేషనల్ స్టేడియం (మిర్పూర్)లో జరగాల్సి ఉంది.పాకిస్తాన్ మీడియా ఔట్‌లెట్ జియో సూపర్ ప్రకారం, ప్రస్తుత రీజనల్ టెన్షన్స్ మరింత పెరిగితే ట్రావెల్ రిస్కులు, సెక్యూరిటీ ఆందోళనలు పెరిగే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో సిరీస్ పోస్ట్‌పోన్ లేదా క్యాన్సిల్ అయ్యే అవకాశం ఉందని సోర్సెస్ తెలిపాయి. ౹ాజదీ ఇంకా అధికారికంగా ఏమీ ప్రకటించలేదు, కానీ ఇన్‌సైడర్ల ప్రకారం సిరీస్ జరిగేందుకు పరిస్థితి మెరుగుపడాల్సి ఉంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు మాత్రం ఈ అనిశ్చితి గురించిన రిపోర్టులను తిరస్కరించింది. పీసీబీ నుంచి ఏవిధమైన అధికారిక కమ్యూనికేషన్ రాలేదని, సిరీస్ ప్రిపరేషన్స్ పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని బీసీబీ అధికారులు చెప్పారు. ఢాకాకు పాకిస్తాన్ నుంచి డైరెక్ట్ ఫ్లైట్స్ అందుబాటులో ఉన్నాయని, బంగ్లాదేశ్‌లో ఎలాంటి సెక్యూరిటీ ఆందోళనలు లేవని వారు స్పష్టం చేశారు. ఈ సిరీస్ ముందు పాకిస్తాన్ టీ20 వరల్డ్ కప్ 2026లో సూపర్ 8 దశలోనే నిష్క్రమించింది. దీంతో పీసీబీ ఆటగాళ్లపై భారీ ఫైన్లు విధించింది (ప్రతి ఆటగాడికి పీకేఆర్5 మిలియన్). బాబర్ అజామ్, సైమ్ అయూబ్, మొహమ్మద్ నవాజ్ వంటి సీనియర్లను ఈ ఓడీఐ సిరీస్‌కు డ్రాప్ చేసే అవకాశం ఉందని రిపోర్టులు వచ్చాయి. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని పీసీబీ ఆలోచిస్తోంది. ప్రస్తుతం సిరీస్ భవిష్యత్ పూర్తిగా మిడిల్ ఈస్ట్ పరిస్థితులపై ఆధారపడి ఉంది. పరిస్థితి మెరుగుపడకపోతే రెండు బోర్డుల మధ్య చర్చలు జరిగి సిరీస్ పోస్ట్‌పోన్ అయ్యే అవకాశం ఉంది.

# పాక్ కంటే దారుణంగా భారత్!

## సెమీస్ ముందు టీమిండియాను టెన్షన్ పెడుతున్న గణాంకాలు




**ఢిల్లీ :** ఐసీసీ మెన్స్‌టీ20 వరల్డ్ కప్2026లో టీమ్ ఇండియా సెమీఫైనల్‌కు చేరుకున్నప్పటికీ, జట్టును కలవరపెడుతున్న ప్రధాన సమస్య ఫీల్డింగ్.. కీలక మ్యాచ్‌ల ముందు భారత జట్టు క్యాచింగ్‌లో తీవ్ర బలహీనత బయటపడింది. ఒక భయంకరమైన గణాంకం ఇప్పుడు అభిమానులను, జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. టోర్నీలో భారత్ అద్భుత విజయాలు సాధిస్తున్నా, ఫీల్డింగ్ విషయంలో మాత్రం అత్యంత వెనుకబడి ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, క్యాచ్‌లు పట్టడంలో భారత్ 'చివరి' స్థానంలో నిలవడం గమనార్హం.

### పాకిస్థాన్ కంటే వెనుకబడిన టీమ్ ఇండియా!

సాధారణంగా ఫీల్డింగ్‌లో పాకిస్థాన్ ఆటగాళ్లను విమర్శిస్తుంటారు.. కానీ, ఈ ప్రపంచ కప్‌లో భారత్ వారికంటే పేలవ ప్రదర్శన చేస్తోంది టీమిండియా.. భారత్ సక్సెస్ రేటు కేవలం 72.7 శాతంగా ఉంటే పాకిస్తాన్ సక్సెస్ రేటు 83.3 శాతంగా ఉంది.. సూపర్-8కు చేరిన అన్ని జట్లలో భారత్ క్యాచింగ్ సక్సెస్ రేటు అతి తక్కువగా ఉంది. ఇంగ్లాండ్ 87.2 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, భారత్ అట్టడుగున నిలిచింది.

### వెస్టిండీస్ మ్యాచ్‌లో బయటపడ్డ బలహీనతలు

ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ విజయం సాధించినా, ఫీల్డింగ్ లోపాలు స్పష్టంగా కనిపించాయి. అభిషేక్ శర్మ.. రోస్టన్ చేజ్ క్యాచ్ వదిలేశాడు (ఆ తర్వాత చేజ్ 40 పరుగులు చేశాడు).. తిలక్ వర్మ.. రూథర్‌ఫోర్డ్ క్యాచ్‌ను నేలపాలు చేశాడు.. మరోసారి అభిషేక్ శర్మ.. పావెల్ ఇచ్చిన సులభమైన క్యాచ్‌ను వదిలివేశాడు.. ఒకవేళ వెస్టిండీస్ బ్యాటర్లు ఆ క్యాచ్‌ల తర్వాత మరింత రెచ్చిపోయి ఉంటే ఫలితం మరోలా ఉండేది.

**జట్ల వారీగా క్యాచింగ్ సక్సెస్ రేటు:**

- ఇంగ్లాండ్ 87.2 శాతం
- జింబాబ్వే 85.4 శాతం
- వెస్టిండీస్ 84.6 శాతం
- పాకిస్తాన్ 83.3 శాతం
- భారత్ 72.7 శాతంగా మాత్రమే ఉంది..

**అయితే, "క్యాచ్‌లు మ్యాచ్‌లను గెలిపిస్తాయి" అన్నది క్రికెట్ సామెత. సెమీఫైనల్స్ చేరిన ఆనందంలో ఉన్న సూర్యకుమార్ యాదవ్ బ్రిగేడ్, ఈ ఫీల్డింగ్ లోపాలను వెంటనే సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే సెమీస్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.**

### టోర్నీలో ఇప్పటివరకు కోల్పోయిన క్యాచ్‌లు

ఈ ప్రపంచ కప్‌లో టీమ్ ఇండియా ఇప్పటివరకు మొత్తం 13 క్యాచ్‌లను నేలపాలు చేసింది. పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లోనే ఏకంగా 4 క్యాచ్‌లు వదిలేశారు. నాకౌట్ దశలో ఇంగ్లాండ్ వంటి పటిష్టమైన జట్లతో తలపడేటప్పుడు, ఒక్క క్యాచ్ వదిలేసినా అది మ్యాచ్ ఫలితాన్ని మార్చేసే ప్రమాదం ఉంది.

# "అది ఫీల్డింగ్ హా.. మీకు క్రికెట్ రాదు"..

## భారత్‌పై మరోసారి విషం కక్కిన పాక్ మాజీ ప్లేయర్..




టీ20 వరల్డ్ కప్‌లో టీమిండియా సెమీఫైనల్‌కు చేరింది. భారతీయులందరూ సంతోషంగా ఉన్నారు. కానీ.. పాకిస్థాన్ మాజీ ప్లేయర్లు, ఆ దేశస్థులకు మాత్రం కడుపు మంట పెరిగింది. ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ చిత్తుగా ఓడిపోయింది. తర్వాత సూపర్-8 నుంచి ఎలిమినేట్ అయ్యింది. ఈ నేపథ్యంలో భారత ప్లేయర్ల తీరుపై పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఆమిర్ ప్రత్యేకంగా ఫీల్డింగ్‌ను విమర్శించాడు. మూడు-నాలుగు క్యాచ్లు మిస్ అయ్యాయని, బుమ్రా తప్ప మిగతా బౌలర్లందరూ బలహీనంగా ఉన్నారని అభిప్రాయపడ్డాడు. మొత్తం ఆట ఒక బౌలర్ల మీదే ఆధారపడి ఉంటుందన్నాడు.ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇటీవల ఆమిర్ ఇండియా సెమీఫైనల్‌కు చేరదని జోష్యం చెప్పాడు. భారతీయ జట్టు సెమీస్ క్వాలిఫై కాదని చెప్పిన మాటలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారి తీశాయి. ఇప్పుడు భారత్ సెమీస్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికీ వక్ర బుద్ధి, విషం కక్కడం మానడం లేదు. తాజాగా ఇండియా-వెస్టిండీస్ మ్యాచ్ తర్వాత.. సంజు శామ్సన్ తన జీవితంలో అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడని కొనియాడుతూనే.. భారత్‌కు ఇప్పటికీ బెస్ట్ మంచి క్రికెట్ ఆడటం రాలేదన్నాడు. అంటే భారత్ బెస్ట్ ఫర్ఫామెన్స్ ఇవ్వలేకపోతోందని చెప్పాడు. తమ జట్టు పరిస్థితిని పట్టించుకోకుండా.. భారత్ ప్రదర్శన, బౌలింగ్, టీమ్ లోపాలను ఎత్తి చూపడంపై తీవ్ర చర్చకు దారి తీసింది. ఆ దేశస్థులతో పాటు టీమిండియా ఫ్యాన్స్ సైతం మండిపడుతున్నారు. ముందు మీది మీరు కనుక్కోండి అంటూ ఫైర్ అవుతున్నారు.

# ఉగాదికి విశ్వంభర స్పెషల్ గ్లింప్స్




మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'విశ్వంభర'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు వశిష్ట ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తుండగా,యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, ఛాయాగ్రహణ బాధ్యతలు చోటా కే నాయుడు నిర్వహిస్తున్నారు. విజువల్‌గా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం అత్యాధునిక సాంకేతికతతో రూపొందుతోంది. షూటింగ్ పూర్తయినప్పటికీ 'విశ్వంభర' విడుదల కొంతకాలంగా వాయిదా పడుతోంది. ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని తెలుస్తోంది. అత్యున్నత స్థాయి సీజీ వర్క్ అవసరం కావడంతో ఎక్కడా రాజీ పడకుండా మేకర్స్ సమయం తీసుకుంటున్నారు. టీజర్‌లోని కొన్ని గ్రాఫిక్స్‌పై సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలను సీరియస్‌గా తీసుకుని రీ-వర్క్ కూడా చేపట్టినట్లు సమాచారం.

ఈ చిత్రంలో వీఎఫ్ఎక్స్‌కే దాదాపు రూ.75 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారనే వార్తలు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఉగాది సందర్భంగా 'విశ్వంభర' స్పెషల్ గ్లింప్స్ విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే గ్లింప్స్‌తో పాటు అధికారిక రిలీజ్ డేట్ ప్రకటించే అవకాశముందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే టీజర్‌తో మంచి క్రేజ్ తెచ్చుకున్న ఈ చిత్రం, కొత్త గ్లింప్స్‌తో అంచనాలను మరింత పెంచే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కథ విషయానికి వస్తే, 'విశ్వంభర' 14 లోకాల కాన్సెప్ట్ చుట్టూ తిరిగే ఫాంటసీ అడ్వెంచర్‌గా ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. పౌరాణికంగా చెప్పబడే ఊర్ధ్వ లోకాలు, అధో లోకాల నేపథ్యంతో కథ సాగుతుందని, వీటికి మించి ఉన్న 'విశ్వంభర' అనే ప్రత్యేక లోకాన్ని చేరుకోవడానికి హీరో చేసే సాహస యాత్ర ప్రధాన కథాంశమని ప్రచారం.

ఈ స్టోరీ లైన్ మెగా అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ థియేట్రికల్ ట్రైలర్ ఇప్పటికే సిద్ధంగా ఉందని తెలిపారు. టీజర్ లో చూసిన విజువల్స్‌తో పోలిస్తే ట్రైలర్ పూర్తిగా భిన్నంగా, మైండ్ బ్లోయింగ్ అనుభూతిని ఇస్తుందని ఆయన వ్యాఖ్యానించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. టీజర్‌పై వచ్చిన విమర్శలకు ట్రైలర్‌తో గట్టి సమాధానం ఇవ్వాలన్నదే యూనిట్ లక్ష్యమని తెలుస్తోంది.




# స్పిరిట్ నుంచి ప్రకాశ్ రాజ్ ఔట్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో మోస్ట్ ఎవెయిటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ స్పిరిట్. యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే మొదలైంది. కాగా ఈ చిత్రంలో విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో నటిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. అయితే స్పిరిట్ షూటింగ్‌ను తాను ఇంకా మొదలుపెట్టలేదని క్లారిటీ కూడా ఇచ్చాడు ప్రకాశ్ రాజ్. ఇదిలా ఉంటే మరోవైపు ఎవరూ ఊహించని విధంగా బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లుక్‌ను షేర్ చేశారు. ఈ నేపథ్యంలో తాజా పుకారు ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. మేకర్స్ ప్రకాశ్ రాజ్ పేరు ట్యాగ్ చేయకపోయే సరికి దాదాపు స్పిరిట్ నుంచి తప్పుకున్నట్టేనంటూ కొత్త వార్త తెరపైకి వచ్చింది. రాజకీయాలకు సంబంధించిన కామెంట్స్ చేయడం సినిమాపై ప్రభావం చూపించే అవకాశం ఉందని సందీప్ రెడ్డి వంగా ప్రకాశ్ రాజ్‌కు చెప్పాడట. అయితే కామెంట్స్ చేయడం గురించి ప్రకాశ్ రాజ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి ఎలాంటి హామీనివ్వకపోవడంతో ఈ సినిమా నుంచి ప్రకాశ్ రాజ్ తప్పించి వివేక్ ఒబెరాయ్‌ను తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. కానీ ఈ వార్తలపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తోంది.

# టాక్సిస్‌లో తబాహి సాంగ్ విడుదల

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం యష్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనుందనే విశ్వాసం అభిమానుల్లో కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై హైప్‌ను అమాంతం పెంచేసింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'తబాహి'ను మేకర్స్ విడుదల చేశారు. అయితే కేవలం ఆడియో రూపంలో మాత్రమే సాంగ్ విడుదల కావడంతో ఫ్యాన్స్ కొంత నిరాశ వ్యక్తం చేస్తున్నారు. విజువల్ ప్రెజెంటేషన్ కోసం ఎదురు చూసిన అభిమానులకు లిరికల్ లేదా వీడియో సాంగ్ రాకపోవడం చిన్న నిరుత్సాహమే అయినప్పటికీ, పాట మాత్రం మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. ఈ సాంగ్‌ను పాన్ ఇండియా స్థాయిలో అన్ని ప్రధాన భాషల్లో విడుదల చేశారు. తెలుగులో ఈ పాటకు ప్రముఖ లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా, సంగీత దర్శకుడు విశాల్ మిశ్రా స్వరపరచి స్వయంగా ఆలపించారు. మ్యూజిక్‌లో యాక్షన్ మూడ్, ఎమోషనల్ అండర్‌టోన్ కలగలిపిన శైలి కనిపిస్తోందని సంగీత ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. 'టాక్సిక్'లో యష్‌కు జోడీగా కియారా అద్వాని నటిస్తుండగా, కీలక పాత్రల్లో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, టోవినో థామస్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ తారాగణం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'తబాహి' సాంగ్‌తో 'టాక్సిక్' మ్యూజికల్ జర్నీ ప్రారంభమైంది. త్వరలో విజువల్ సాంగ్ విడుదలైతే అంచనాలు మరింత పెరగడం ఖాయం.







# ఉస్తాద్ నుంచి పవన్ మరో లుక్

పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ప్రాజెక్ట్ ఉస్తాద్ భగత్ సింగ్ హరీష్ శంకర్ డైరెక్షన్‌లో తెరకెక్కుతున్నది. ఈ మూవీలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన దేఖ్ లేంగే సాలా, సాంగ్స్ నెట్టింట వైరల్ అవుతున్నారు. మేకర్స్ ఏదో ఒక ప్రమోషనల్ మెటీరియల్ రిలీజ్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. తాజాగా రిలీజ్ చేసిన లుక్‌లో ఉస్తాద్ భగత్ సింగ్‌గా పవన్ కల్యాణ్ తన దైన స్టైల్‌లో చైర్‌పై కూర్చొని ఛిల్ అవుట్ మూడ్‌లో ఉండటం చూడొచ్చు. ఈ స్టిల్ చూస్తుంటే అభిమానులు ఆశించే ఎంటర్‌టైన్‌మెంట్ ఉస్తాద్ భగత్ సింగ్‌లో పుష్కలంగా ఉండబోతున్నట్టు హరీష్ శంకర్ హింట్ ఇచ్చేస్తున్నాడు. తాజా లుక్ అభిమానులు, మూవీ లవర్స్‌లో మరింత హైప్ పెంచేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మేకర్స్ ఇప్పటికే రిలీజ్ చేసిన ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్‌లో భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ పవన్ కల్యాణ్ చెబుతున్న డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి.గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

# పెద్ది రెండో సింగిల్ విడుదలకు సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' రెండో సింగిల్ 'రాయ్ రాయ్ రా రా' విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. తొలి పాట 'చికిరి చికిరి'కి మంచి స్పందన లభించిన నేపథ్యంలో రెండో సాంగ్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి ఎలాంటి ప్రోమో విడుదల చేయకపోవడంతో పాట రిలీజ్ టైమ్‌పై కొంత గందరగోళం నెలకొంది. తాజా అప్‌డేట్ ప్రకారం 'రాయ్ రాయ్ రా రా' పాటను మంగళవారం సాయంత్రం 7:02 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ టైమ్‌ను కన్ఫర్మ్ చేస్తూ చరణ్‌కి సంబంధించిన పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో చరణ్ మాస్ అవతార్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఉత్సాహపరుస్తున్నారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ పాట మోటివేషనల్ టచ్‌తో కూడిన మాస్ నంబర్‌గా ఉండనుంది. ముఖ్యంగా చరణ్ డాన్స్ మూవ్స్ ఈ సాంగ్‌కు హైలైట్ అవుతాయని టాక్. తన ఎనర్జీ, గ్రేస్‌తో చరణ్ మరోసారి అభిమానులను అలరించనున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**